# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 17 | గురువారం, 18 సెప్టెంబర్ 2025 | పేజీలు: 09 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com


# తెలంగాణ సాయుధ పోరాటం గొప్పది





**పోరాటంలో మహిళల పాత్ర అపూర్వం**

**మహిళల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం**

**రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**పబ్లిక్ గార్డెన్స్‌లో ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ప్రపంచ ఉద్యమాల చరిత్రలోనే తెలంగాణ సాయుధ పోరాటం ఒక గొప్ప మైలురాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన ప్రజా పాలన దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం సభలో ప్రసంగిస్తూ తెలంగాణ ఉద్యమ చరిత్ర, మహిళల పాత్ర, అభివృద్ధి లక్ష్యాలపై మాట్లాడారు.

**మహిళల పాత్ర అపూర్వం – కోటి మందిని కోటీశ్వరులు చేస్తాం**

తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళల పాత్ర మరువలేనిదని గుర్తుచేస్తూ, "మహిళల అభివృద్ధికి మేం అండగా నిలుస్తాం. కోటి మందిని కోటీశ్వరులుగా చేయడం మా లక్ష్యం" అని సీఎం రేవంత్ తెలిపారు. తెలంగాణను స్వేచ్ఛ, ..మిగతా 2లో




# తీన్మార్ టీఆర్పీ

**కొత్త పార్టీ పెట్టిన ఎమ్మెల్సీ మల్లన్న**

**'తెలంగాణ రాజ్యాధికార పార్టీ' (టీఆర్పీ)గా నామకరణం**

**పార్టీ జెండాను ఆవిష్కరించిన తీన్మార్ మల్లన్న**

**అధ్యక్షుడిగా మల్లన్న, ఇద్దరు వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం**

**ప్రధాన కార్యదర్శులుగా నలుగురికి అవకాశం**

**రాష్ట్ర కార్యవర్గంలో ఎవరెవరు ఉన్నారంటే..!**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్ తన కొత్త రాజకీయ పార్టీకి 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ' అనే పేరును ఖరారు చేశారు. హైదరాబాద్ లోని ఓ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో పార్టీని ప్రకటించారు. పార్టీ పేరు, జెండాను ఆవిష్కరించారు,,.. జెండా పైభాగంలో ఎరుపు రంగు, కింది భాగంలో ఆకుపచ్చ రంగు ఉన్నాయి. జెండా మధ్యలో ..మిగతా 2లో



# మహిళల ఆరోగ్యమే సమాజ అభివృద్ధికి పునాది

**ఆరోగ్యమహిళ క్లినిక్‌ల ద్వారా ఉచిత వైద్య పరీక్షలు, చికిత్సలు**

**రాష్ట్రవ్యాప్తంగా మాతాశిశు ఆరోగ్య కేంద్రాల విస్తరణ**

**మహిళల్లో బ్రెస్ట్ కేన్సర్ ఎర్లీ డిటెక్షన్‌పై ప్రత్యేక దృష్టి**

**సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక హెల్త్ క్యాంపులు**

**వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

రాష్ట్ర మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది, కుటుంబం ఆరోగ్యంగా ఉంటే సమాజం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. మంత్రి మాట్లాడుతూ, మహిళల కోసం ప్రత్యేకంగా ఆరోగ్యమహిళ క్లినిక్స్ ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ క్లినిక్‌లలో ..మిగతా 2లో



## ఎవరు పార్టీ పెట్టినా స్వాగతిస్తాం

**తీన్మార్ మల్లన్న కొత్త పార్టీపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ స్పందన**

**పార్టీ నిర్ణయాలను వ్యతిరేకించడం వల్లే మల్లన్నను సస్పెండ్**

**తెలంగాణ విలీన దినోత్సవానికి, కవితకు ఏం సంబంధం**

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

02

## నిజాం పాలనలో అనేక దారుణాలు

**సర్దార్ పటేల్ ఉక్కు సంకల్పం వల్లే హైదరాబాద్ విలీనం సాధ్యమైంది**

**గత ప్రభుత్వాలు ఈ చారిత్రక దినాన్ని దశాబ్దాలుగా విస్మరించాయి**

**మా ప్రభుత్వం వచ్చాకే ఈ వేడుకను చిరస్మరణీయం చేసింది**

**ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ**



**నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :**

హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ తొలి హోంమంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అందించిన ..మిగతా 2లో

## ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ర్యాగింగ్ కలకలం

**9వ తరగతి విద్యార్థి పుట్టినరోజు వేడుకల్లో ర్యాగింగ్ కలకలం**

**తోటి విద్యార్థుల దాడితో బ్లీడింగ్ – పట్టించుకోని యాజమాన్యం**

**మా బాబు ప్రైవేట్ పార్ట్స్‌పై తన్నారని ఆవేదన వ్యక్తం చేసిన తల్లితండ్రులు**

**కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించిన నాచారం పోలీసులు**

02



## నగరంలో కుండపోత...

**గంటల తరబడి ట్రాఫిక్‌లో తీవ్ర అవస్థలు**

**కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్**

**మియాపూర్‌లో అత్యధికంగా 9.7 సెం.మీ.**

**అల్పపీడనమే కారణమన్న వాతావరణ శాఖ**

**అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ హెచ్చరిక**

02

# ట్రిపుల్‌ఆర్, ఫ్యూచర్ సిటీ.. గాలిలో మేడలు

**ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌లో భారీ స్కామ్**

**సర్వే నంబర్లతో సహా బయటపెడతాం**

**ఎల్ అండ్ టీ, ఎమ్మార్, గ్రీన్ కో కేసుల్లో సీఎంకు ముడుపులు**

**అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ డ్రామా మైనారిటీ ఓట్ల కోసం ప్రయత్నం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**ట్రిపుల్‌ఆర్ బాధితులకు అండగా ఉంటాం**

**తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసిన బాధితులు**

**బాధితులకు భరోసా కల్పించిన కేటీఆర్**

05

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ధాటిగా విరుచుకుపడ్డారు. "ప్రజాపాలనలో ప్రజలు లేకపోతే అది ప్రజాస్వామ్యం ఎలా అవుతుంది? రేవంత్ రెడ్డి పాలన ప్రజలకు మేలు చేసేలా లేదు, ముడుపుల పాలనగా మారింది" అంటూ ఆరోపించారు. గ్రూప్1 పరీక్షల్లో అవకతవకలు జరిగితే రద్దు చేయలేదని కేటీఆర్ ప్రశ్నించారు. "మా హయాంలో పేపర్ లీక్ అయితే వెంటనే పరీక్ష రద్దు చేసాం. ఇప్పుడు అవినీతి వెలుగులోకి వచ్చినా చర్యలు తీసుకోవడం లేదు. ఎవరిది నియంత పాలన?" అని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక కాలేజీలు మూతపడ్డాయని, ఆరోగ్యశ్రీ ..మిగతా 2లో

# ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్ధరించాలి

**సేవలు నిలిపివేయడంతో నిరుపేదలకు తీవ్ర ఇబ్బంది**

**ప్రభుత్వం ఇప్పటికే 21 నెలల్లో రూ.1,779 కోట్లు చెల్లించింది**

**కొత్తగా163 వైద్య సేవలు ఆరోగ్యశ్రీలో చేరిక**

**రెండు రోజుల్లోనే రూ.100 కోట్లు విడుదల చేశాం**

**పెండింగ్ ఉన్నవి విడతల వారీగా చెల్లిస్తాం**

**మంత్రి పొన్నం ప్రభాకర్**



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రైవేట్ హాస్పిటల్స్‌ను ఉద్దేశించి కీలక ప్రకటన చేశారు. ప్రైవేట్ హాస్పిటల్స్ ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేయడం పేద ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మానవీయ కోణంలో హాస్పిటల్ యాజమాన్యాలు వెంటనే వెనక్కి తగ్గి, ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్ధరించాలన్నారు. ముఖ్యమంత్రి ..మిగతా 2లో



# మహిళల ఆరోగ్యమే సమాజ అభివృద్ధికి పునాది

మొదటిపేజీ తరువాయి

అవసరమైన అన్ని రకాల పరీక్షలు ఉచితంగా చేయించడంతో పాటు, చికిత్స మరియు మెడిసిన్ కూడా అందజేస్తున్నామని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలోనే 201213లో ప్రారంభమైన మాతాశిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా విస్తరించి, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సమగ్ర వైద్య సేవలు అందిస్తున్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న కేన్సర్ కేసులు, ముఖ్యంగా మహిళల్లో ఎక్కువగా కనిపిస్తున్న బ్రెస్ట్ కేన్సర్ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, రాష్ట్రవ్యాప్తంగా డే కేర్ కేన్సర్ సెంటర్ల ద్వారా స్క్రీనింగ్, ఎర్లీ డిటెక్షన్ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి వెల్లడించారు. అలాగే ఎన్‌సీడీ క్లినిక్స్ ద్వారా బీపీ, షుగర్, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులు, కేన్సర్ వంటి సమస్యలతో బాధపడుతున్న మహిళలకు చికిత్స అందిస్తున్నామని చెప్పారు. మహిళలతో పాటు ట్రాన్స్‌జెండర్ల కోసం మైత్రి క్లినిక్స్ కూడా ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఆరోగ్య రంగంలోనే కాకుండా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, సంక్షేమ పథకాల అమలులో కూడా మహిళలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్' కార్యక్రమానికి మంత్రి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు మహిళల కోసం ప్రత్యేక హెల్త్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సేవలను మహిళలు తప్పక వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

# నిజాం పాలనలో అనేక దారుణాలు

మొదటిపేజీ తరువాయి



సేవలను స్మరించుకున్నారు. నిజాం పాలనలో హైదరాబాద్ సంస్థానంలో జరిగిన దారుణాలను ఆయన గుర్తుచేశారు. దశాబ్దాల పాటు గత ప్రభుత్వాలు ఈ చారిత్రక దినాన్ని విస్మరించాయని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే సర్దార్ పటేల్ ఉక్కు సంకల్పం వల్లే హైదరాబాద్ విలీనం సాధ్యమైంది. గత ప్రభుత్వాలు ఈ చారిత్రక దినాన్ని దశాబ్దాలుగా విస్మరించాయి మా ప్రభుత్వం వచ్చాకే ఈ వేడుకను చిరస్మరణీయం చేసింది ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

# ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్ధరించాలి

మొదటిపేజీ తరువాయి




రేవంత్ రెడ్డి నాయకత్వంలో, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకువచ్చిందని చెప్పారు. ఐదు లక్షల ఉచిత వైద్య పరిమితిని పది లక్షలకు పెంచడంతో పాటు, గత 21 నెలల్లో రూ.1,779 కోట్లు ప్రైవేట్ హాస్పిటల్స్‌కి చెల్లించిందని వివరించారు. ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాతే 1,375 వైద్య చికిత్సల చార్జీలు సగటున 22శాతం పెంచబడినట్లు, అలాగే కొత్తగా 163 ఖరీదైన వైద్య సేవలు ఆరోగ్యశ్రీలో చేర్చినట్లు మంత్రి గుర్తుచేశారు. దీంతో పేదలకు మరింత వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ కొత్త ప్యాకేజీల వల్లే ప్రభుత్వం అదనంగా రూ.487.29 కోట్లు ఖర్చు చేస్తోందని వివరించారు. 2014 నుంచి 2023 నవంబర్ వరకు సగటున నెలకు రూ.57 కోట్లు చెల్లించగా, 2023 డిసెంబర్ నుంచి 2024 డిసెంబర్ వరకు సగటున నెలకు రూ.75 కోట్లు చెల్లించినట్లు మంత్రి వివరించారు. ఇప్పటికే రెండు రోజుల్లోనే రూ.100 కోట్లు ప్రైవేట్ హాస్పిటల్స్ ఖాతాలో జమ చేసినట్లు కూడా తెలిపారు. పెండింగ్ బకాయిలను విడతల వారీగా చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ హాస్పిటల్స్ మానవీయ కోణంలో ఆలోచించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యశ్రీ సేవలు పేదలకు ప్రాణాధారం కావడంతో, వాటిని వెంటనే పునరుద్ధరించాలని స్పష్టం చేశారు.

# ఎవరు పార్టీ పెట్టినా స్వాగతిస్తాం

- తీన్మార్ మల్లన్న కొత్త పార్టీపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ స్పందన
- పార్టీ నిర్ణయాలను వ్యతిరేకించడం వల్లే మల్లన్నను సస్పెండ్
- తెలంగాణ విలీన దినోత్సవానికి, కవితకు ఏం సంబంధం
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

తెలంగాణ విలీనంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర ఏమీ లేదంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో స్పందించారు. కవితకు చరిత్రపై అవగాహన లేదంటూ ఆయన విమర్శించారు. "అసలు కవిత ఎప్పుడు పుట్టారు? ఆమెకు చరిత్ర తెలుసా?" అంటూ సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ విలీన దినోత్సవానికి, కవితకు ఏం సంబంధమని ఆయన నిలదీశారు. చారిత్రక వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే మంచిదని హితవు పలికారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అంశంపై కూడా మహేశ్ గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలను వ్యతిరేకించినందువల్లే తీన్మార్ మల్లన్నను పార్టీ నుంచి సస్పెండ్ చేయాల్సి వచ్చిందని ఆయన వివరించారు. అయినప్పటికీ, బీసీల హక్కుల కోసం పోరాడే నాయకుడిగా మల్లన్నను తాను గౌరవిస్తానని అన్నారు. రాజకీయాల్లో ఎవరు పార్టీలు పెట్టినా స్వాగతిస్తామని, మల్లన్న కొత్త పార్టీ నిర్ణయాన్ని కూడా ఆహ్వానిస్తున్నామని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. ఇదే సందర్భంగా పార్టీ అంతర్గత వ్యవహారాలపైనా ఆయన స్పందించారు. కోమటిరెడ్డి సోదరులు తమ అభిప్రాయాలను బాహాటంగానే వెల్లడిస్తారని, కాంగ్రెస్ పార్టీలో ఆ మేరకు స్వేచ్ఛ ఉందని తెలిపారు. అయితే, ఆ స్వేచ్ఛను అలుసుగా తీసుకుని ఎవరైనా 'రెడ్ లైన్' దాటితే మాత్రం ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టంగా హెచ్చరించారు. పార్టీ క్రమశిక్షణను అతిక్రమించే చర్యలను సహించబోమని తేల్చిచెప్పారు.

# తీన్మార్ టీఆర్పీ




మొదటిపేజీ తరువాయి

కార్మిక చక్రాన్ని, దాని నుంచి పైకి లేస్తున్నట్లుగా పిడికిలి బిగించిన అరచేతి చిహ్నంగా పొందుపరిచారు. జెండాపై 'ఆత్మగౌరవం, అధికారం, వాటా' అనే నినాదాన్ని ముద్రించారు. తీన్మార్ మల్లన్న అసలు పేరు చింతపండు నవీన్ కుమార్. ఆయన మొదట జర్నలిస్ట్‌గా పని చేశారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. రాజకీయ ప్రవేశం 2015లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో నల్గొండఖమ్మంవరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2021 డిసెంబర్ 7న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) లో చేరారు. 2023 నవంబర్ 8న మళ్లీ కాంగ్రెస్ పార్టీలోకి తిరిగి చేరారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్ రావు థాక్రే సమక్షంలో చేరారు. 2024లో కాంగ్రెస్ పార్టీ నుండి పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అయితే, కులగణనపై దారుణమైన విమర్శలు చేయడంతో 2025 ఫిబ్రవర్ 5న కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ అయ్యారు. పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడినట్లు ఆరోపణలు చేస్తూ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఆయన సమాధానం ఇవ్వకపోవడంతో సస్పెన్షన్ వేటు వేశారు. తన కొత్త పార్టీ బీసీ సమాజాన్ని ఏకం చేసి, వారి రాజకీయ, ఆర్థిక హక్కుల కోసం పోరాడే ప్లాట్‌ఫారమ్‌గా రూపొందించానని అంటున్నారు. బీసీల చేతిలో భూములు, సంపద, రాజకీయ అధికారం అమలు చేయడం లక్ష్యమని చెబుతున్నారు. "తెలంగాణ గడ్డ మీద బీసీలు తమకు తాముగా ఒక రాజకీయ పార్టీని తీసుకొచ్చామని బీసీలు ఏకం చేసి, వారి హక్కుల కోసం పోరాడతాము." అని ప్రకటించారు. అయితే మల్లన్న పార్టీ పెట్టడం ఇదే మొదటి సారి కాదు. 2023లో 'తెలంగాణ నిర్మాణ పార్టీ' పేరుతో కొత్త పార్టీ ప్రకటించారు, కానీ అది ముందుకు సాగలేదు. ఇప్పుడు బీసీ ఎజెండాతో కొత్తగా ప్రయత్నిస్తున్నారు. తీన్మార్ మల్లన్న రాజకీయంగా ముఖ్యమంత్రి స్థానాన్నిపొందాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గతంలో బీసీ సంఘాల కోసం సభలు నిర్వహించారు. ఇప్పుడు నేరుగా పార్టీ పెట్టడం ద్వారా.. బీసీల్లోని అన్ని కులాలను ఏకంగా చేసి ఆయన రాజ్యాధికారం చేపట్టాలని అనుకుంటున్నారు.

# హైదరాబాద్‌లో కుండపోత

- గంటల తరబడి ట్రాఫిక్‌లో తీవ్ర అవస్థలు
- కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్
- మియాపూర్‌లో అత్యధికంగా 9.7 సెం.మీ.
- అల్పపీడనమే కారణమన్న వాతావరణ శాఖ
- అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ హెచ్చరిక



హైదరాబాద్, ప్రజాస్వరం :

భాగ్యనగరాన్ని బుధవారం సాయంత్రం భారీ వర్షం ముంచెత్తింది. అకస్మాత్తుగా కురిసిన కుండపోత వానతో నగరం అస్తవ్యస్తంగా మారింది. పలు ప్రధాన రహదారులు చెరువులను తలపించడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. గంటల తరబడి వాహనాలు ముందుకు కదలకపోవడంతో కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. నగరంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, గచ్చిబౌలి, మాదాపూర్, మియాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కొండాపూర్ వంటి ఐటీ కారిడార్ ప్రాంతాలతో పాటు సరూర్ నగర్, కార్వాన్, చాంద్రాయణగుట్ట, సైదాబాద్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రోడ్లపై పెద్ద ఎత్తున నీరు నిలిచిపోవడంతో వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. అనేక చోట్ల వాహనాలు నీటిలో చిక్కుకుపోయాయి. దీంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వాతావరణ శాఖ లెక్కల ప్రకారం, నగరంలో అత్యధికంగా మియాపూర్‌లో 9.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత లింగంపల్లిలో 8.2 సెం.మీ., హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో 8.1 సెం.మీ., గచ్చిబౌలిలో 6.6 సెం.మీ., చందానగర్‌లో 6.4 సెం.మీ. వర్షపాతం కురిసినట్లు అధికారులు తెలిపారు. పశ్చిమ మధ్య బంగాళాఖాతం నుంచి తెలంగాణ మీదుగా ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతోనే ఈ భారీ వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ అధికారులు వివరించారు. మరోవైపు, జీహెచ్‌ఎంసీ యంత్రాంగం అప్రమత్తమైంది. అత్యవసర సహాయక బృందాలు రంగంలోకి దిగి, రోడ్లపై నిలిచిన నీటిని తొలగించే పనులను చేపట్టాయి. ప్రజలు అనవసరంగా బయటకు రావొద్దని, మ్యాన్‌హోల్స్ వద్ద జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.



# ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ర్యాగింగ్ కలకలం

- 9వ తరగతి విద్యార్థి పుట్టినరోజు వేడుకల్లో ర్యాగింగ్ కలకలం
- తోటి విద్యార్థుల దాడితో బ్లీడింగ్ – పట్టించుకోని యాజమాన్యం
- మా బాబు ప్రైవేట్ పార్ట్‌స్‌పై తన్నారని ఆవేదన వ్యక్తం చేసిన తల్లితండ్రులు
- కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించిన నాచారం పోలీసులు

హైదరాబాద్, ప్రజాస్వరం :

హైదరాబాద్ నగరంలోని నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్)లో ర్యాగింగ్ ఘటన చోటుచేసుకుని కలకలం రేపింది. 9వ తరగతి చదువుతున్న రిషాంత్ రెడ్డి అనే విద్యార్థి పుట్టిన రోజు వేడుకల్లో తోటి విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడినట్లు తెలుస్తోంది. విద్యార్థి తల్లితండ్రులు తెలిపిన వివరాల ప్రకారం, ర్యాగింగ్ సమయంలో తోటి విద్యార్థులు రిషాంత్‌ను తీవ్రంగా ఇబ్బంది పెట్టడమే కాకుండా, అతని ప్రైవేట్ పార్ట్‌స్‌పై తన్నినట్లు ఆరోపించారు. ఈ ఘటనలో విద్యార్థి రక్తస్రావానికి గురైనా, పాఠశాల యాజమాన్యం పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై బాధిత విద్యార్థి తల్లితండ్రులు నాచారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ర్యాగింగ్ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ర్యాగింగ్ వంటి ఘటనలను అరికట్టడంలో నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. ఈ ఘటనతో పాఠశాల భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

# ట్రిపుల్ఆర్, ఫ్యూచర్ సిటీ.. గాలిలో మేడలు

మొదటిపేజీ తరువాయి

డబ్బులు రాక హాస్పిటల్ సేవలు ఆగిపోయాయని, యూరియా కొరతతో వ్యవసాయం దెబ్బతింటోందని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి పాలనలో కుటుంబరాజకీయాలు లేవని చెప్పుకుంటే, ఆయన బామ్మర్ది సృజన్ రెడ్డికి రెండు కాంట్రాక్టులు ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు. అలాగే సీఎం బంధువులు కల్వకుర్తి ప్రాంతంలో భూములు కొనుగోలు చేసి, ఆ భూములకు లాభం కలిగేలా ఆర్.ఆర్.ఆర్. అలైన్‌మెంట్ మార్చారని ఆరోపించారు. "జైపాల్ రెడ్డి బంధువులకూ లాభం చేకూర్చడానికే ఈ మార్పులు జరిగాయి" అని వ్యాఖ్యానించారు. ఆర్.ఆర్.ఆర్ ప్రాజెక్టును కేటీఆర్ "అతిపెద్ద స్కామ్"గా పిలుస్తూ, త్వరలోనే సర్వే నంబర్లతో సహా బయటపెడతామని చెప్పారు. "ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ అన్నీ గాలిలో మేడలు. సిటీ లేదు, భవిష్యత్తు లేదు - కేవలం డ్రామా మాత్రమే" అంటూ ఎద్దేవా చేశారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు నుంచి ఎల్‌అండ్‌టి తప్పుకోవడానికి సీఎం బెదిరింపులే కారణమని కేటీఆర్ ఆరోపించారు. "సీఎఫ్‌ఓను జైలుకు పంపుతా అని బెదిరించారు. ముడుపులు అడిగినందుకే ఎల్‌అండ్‌టి వెళ్లిపోతోంది" అన్నారు. అదే సమయంలో ఎమ్మార్ కంపెనీలో 26 శాతం వాటాను ప్రభుత్వం అమ్మాలని చూస్తోందని, మూసీ ప్రాజెక్టును కూడా వారికి అప్పగించాలనే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. పొంగులేటి ఇంటిపై రైడ్ జరిగినా ఒక సంవత్సరం గడిచినా పంచనామా బయట పెట్టలేదని కేటీఆర్ ఆరోపించారు. "నోట్ల కట్టలు లెక్కబెట్టే యంత్రాలు ఎందుకు వెళ్లాయి? ఏమీ దొరకలేదని ధ్రువీకరించండి" అంటూ సవాల్ విసిరారు. అలాగే, మహారాష్ట్ర పోలీసులు హైదరాబాద్‌లోనే డ్రగ్స్ పట్టుకున్నారని, రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణలో వైఫల్యం బహిర్గతమైందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేత, మాజీ క్రికెటర్ అజారుద్దీన్పై కూడా కేటీఆర్ వ్యాఖ్యానించారు. "అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ రాదు. కోర్టు పరిధిలో ఉన్న విషయం. క్రికెట్‌లో కట్లు కొట్టిన అజార్‌కు రాజకీయాల్లో కూడా కట్ కొట్టారు. జూబ్లీహిల్స్ నుంచి తప్పించడానికే ఎమ్మెల్సీ ఇస్తామని ప్రకటించారు. మైనారిటీ ఓట్ల కోసం ఈ డ్రామా" అని అన్నారు. కాంగ్రెస్ అధికారం రాకపోతే ప్రజలను నిందించడం తగదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. "మా నాయకుడిని ప్రజలకు సరిగ్గా ప్రమోట్ చేయలేకపోయాము, అది మా తప్పు. కానీ కాంగ్రెస్ పాలనలో ప్రజల కష్టాలు రెట్టింపు అయ్యాయి" అన్నారు. పాదయాత్రకు ఇంకా కొంత టైం ఉంది. ఎన్నికలకు ఇంకో మూడు ఏండ్లు ఉంది. అందుకే పాద యాత్ర కు తొందరేం లేదు. పాద యాత్ర ఉంటుంది. ప్రస్తుతానికి స్లిమ్ అయ్యేందుకు ట్రై చేస్తున్నాను. కొన్ని రోజుల నుంచి జిమ్ చేయడం కొద్దిగా ఆపేశాను' అని కేటీఆర్ చిట్ చాట్ లో మాట్లాడారు.

# తెలంగాణ సాయుధ పోరాటం గొప్పది

మొదటిపేజీ తరువాయి

సమానత్వంలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు.

**విద్య, క్రీడలకు ప్రాధాన్యం – యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణానికి నిధులపై ఫోకస్**

విద్య మాత్రమే భవిష్యత్తుకు దారి చూపే మార్గమని, అందుకే ప్రపంచ స్థాయి విద్యా అవకాశాల కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెడుతోందన్నారు. యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణానికి అయ్యే ఖర్చును ఎఫ్‌ఆర్‌బీఎం నుంచి మినహాయించాలని కేంద్రాన్ని కోరారు. క్రీడల అభివృద్ధికీ అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు.

**రైతులకు న్యాయం – బీసీలకు 42శాతం రిజర్వేషన్**

రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, 48 గంటల్లోనే డబ్బులు రైతుల ఖాతాల్లో జమవుతున్నాయని సీఎం తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో బిల్లు ఆమోదించి, ఇప్పుడు కేంద్రంపై ఒత్తిడి చేస్తున్నామని వెల్లడించారు. కృష్ణా, గోదావరి నదుల జలాల్లో తెలంగాణ వాటాకు సంబంధించి రాజీపడేది లేదని స్పష్టం చేసిన సీఎం, "మన వాటా కోసం న్యాయపోరాటం కొనసాగుతోంది. ఇది తెలంగాణ ప్రజల హక్కు" అని అన్నారు.

**హైదరాబాద్ అభివృద్ధిపై విశేష దృష్టి – మూసీ ప్రక్షాళనకు డిసెంబరులో శ్రీకారం**

హైదరాబాద్‌ను గేట్ ఆఫ్ వరల్డ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. మూసీ నదిని ప్రక్షాళన చేసి, పరివాహక ప్రజలకు మెరుగైన జీవితం కల్పించనున్నామని, ప్రపంచ స్థాయి నిర్మాణాలతో మూసీని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రణాళికను వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు డిసెంబర్‌లో శ్రీకారం చుడతామన్నారు. 30 వేల ఎకరాల్లో "ఫ్యూచర్ సిటీ" నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. అయితే కొందరు దీనికి అడ్డంకులు సృష్టిస్తున్నారని, ప్రజలే వారికి బుద్ధి చెప్పాలని రేవంత్ కోరారు.





# అంతా నా ఇష్టం

- ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేసిన ఉద్యోగులు
- జెండావిష్కరణలో కనిపించని తెలంగాణ తల్లి ఫోటో

**దౌల్తాబాద్ సెప్టెంబర్17(ప్రజాస్వరం) :**

మండల కేంద్రంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన జెండావిష్కరణ కార్యక్రమంలో విస్మయానికి గురిచేసే సంఘటన చోటుచేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన స్పష్టమైన ఉత్తర్వుల ప్రకారం తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవానికి ప్రతీకగా భావించే తెలంగాణ తల్లి ఫోటో ప్రతి అధికారిక కార్యక్రమంలో తప్పనిసరిగా ప్రతిష్ఠించాల్సి ఉంటుంది. అయితే స్థానిక మెడికల్ ఆఫీసర్ నాగరాజు,ఐకెపి అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ నీ రుడి మహిపాల్ నిర్లక్ష్యం కారణంగా జెండావిష్కరణ వేదికపై ఆ ఫోటో కనిపించకపోగా అధికారికంగా ఆమోదించని తెలంగాణ తల్లి ఫోటో పెట్టడం ఆశ్చర్యానికి గురిచేసింది.ఈ ఘటనపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేసిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు ఈ ఘటనపై తక్షణమే దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలంటున్నారు.



## ప్రజాస్వామ్య పాలనలోకి అడుగు పెట్టిన దినం

- ఎస్పీ కె.నారాయణ రెడ్డి

**వికారాబాద్, సెప్టెంబర్ 17(ప్రజాస్వరం):**

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సంధార్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు - తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధ వారం జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్.పి.) శ్రీ కె.నారాయణ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి, సిబ్బందితో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ రోజున రాష్ట్రం ప్రజాస్వామ్య, సమానత్వ, న్యాయ విలువలతో కూడిన పాలనలోకి అడుగు పెట్టిందని గుర్తు చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది మరియు జిల్లా ప్రజలందరికీ ఆయన ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, "ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన మొదటి రోజు ఏ విధంగానైతే సమాజ సేవ చేయాలనే ఉత్సాహంతో విధులలో చేరామో, అదే ఉత్సాహాన్ని చివరి వరకు కొనసాగించాలి" అని పిలుపునిచ్చారు. తెలంగాణను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా నిలబెట్టడానికి మన వంతు కృషిని నిస్వార్థంగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, వికారాబాద్ డి.ఎస్.పి ఎన్. శ్రీనివాస్ రెడ్డి, ఏ.ఆర్. డి.ఎస్.పి వీరేష్, ఇన్స్పెక్టర్ అధికారులు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పోలీస్ సిబ్బంది మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## నూతన సిటీ స్కాన్ ప్రారంభించిన ఎమ్మెల్యే

**మెదక్ సెప్టెంబర్ 17 (ప్రజా స్వరం)**

మెదక్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి లో నూతన 2. 6 కోట్ల తో ఏర్పాటు చేసిన సిటీ స్కాన్ ను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సిటీ స్కాన్ యంత్రం ద్వారా పేద ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. నాపై నమ్మకంతో గెలిపించిన నియోజకవర్గం ప్రజలు బాగుండాలని, విద్య, వైద్యం లో మెరుగైన సేవలు అందించాలని ఉద్దేశ్యంతో అత్యాధునిక సిటీ స్కాన్ ను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని అన్నారు. అంతే కాకుండా భవిష్యత్తు లో ప్రజలకు మరిన్ని సేవ సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ సునీత, మాజీ మున్సిపల్ ఛైర్మన్ చంద్రపాల్, మాజీ కౌన్సిలర్స్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమం,అభివృద్ధి ధ్యేయంగా ప్రజాపాలన





- రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఓబేదుల్లా కోత్వాల్ సాహెబ్.
- అర్హులందరికీ అభయహస్తం గ్యారెంటీ పథకాల అమలు.
- పెద్దపల్లి జిల్లాలో నూతనంగా 12 వేల 168 కుటుంబాలకు రేషన్ కార్డ్ జారి.
- ఎస్సారెస్పీ ఆయకట్టు స్థిరీకరణ కోసం పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి డిపిఆర్ తయారీకి కృషి.
- ఎస్సీ వర్గీకరణ,బీసి లకు 42 శాతం రిజర్వేషన్ తో సామాజిక తెలంగాణ సాధనకు కృషి.
- పట్టణ ప్రాంతాల్లో 173 కోట్లతో పలు అభివృద్ధి పనులు.
- తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలలో పాల్గొన్న రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్.

**పెద్దపల్లి,సెప్టెంబర్17(ప్రజా స్వరం):**

పేద ప్రజల సంక్షేమం,అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందని రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఓబేదుల్లా కోత్వాల్ సాహెబ్ అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలలో రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ ఓబేదుల్లా కోత్వాల్ సాహెబ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.బుధవారం ఉదయం ముఖ్య అతిథి పోలీసు గౌరవ వందనం స్వీకరించి,జాతీయ పతాకావిష్కరణ చేసారు. అనంతరం ముఖ్య అతిథి తన సందేశాన్ని తెలియజేసారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడే నాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అభయహస్తం గ్యారెంటీ పథకాలను ఒక్కొకటిగా అమలు చేస్తున్నామని అన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రైతు భరోసా,ఇందిరమ్మ ఇండ్ల, 500 రూపాయల గ్యాస్ సిలిండర్,200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు.పేదల ఆత్మగౌరవానికి మరో ప్రతీక రేషన్ కార్డులను అర్హులైన పేద కుటుంబాల అందరికీ పంపిణీ చేస్తున్నామని,మన జిల్లాలో నూతనంగా 12 వేల 168 కుటుంబాలకు రేషన్ కార్డ్ జారి చేశామని అన్నారు.ప్రజా ప్రభుత్వం ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీని ప్రారంభించిందని అన్నారు. కాకతీయ కాలువ క్రింద ఉన్న 2 లక్షల 30 వేల ఆయకట్టు స్థిరీకరణ,10 వేల ఎకరాల కొత్త ఆయకట్టు సాగు నీరు అందించేందుకు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పత్తిపాక రిజర్వాయర్ ను 3 నుంచి 5 టిఎంసీల సామర్థ్యంతో నిర్మాణానికి డిపిఆర్ తయారు కోసం కోటి 10 లక్షల రూపాయల మంజూరు చేసామని అన్నారు.13 వేల 396 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ చేసే రామగుండం ఎత్తిపోతల పథకం పెండింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికను పూర్తిచేసి నీటి పారుదల శాఖ మంత్రి చేతుల మీదుగా ప్రారంభించామని తెలిపారు.గోదావరిఖని జనరల్ ఆసుపత్రి 160 కోట్లతో నిర్మాణం జరుగుతుందని అన్నారు.జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో 173 కోట్లు ఖర్చు చేస్తూ సిసి రోడ్లు,సిసి డ్రైయిన్లు,బీ.టి రోడ్లు,స్మశాన వాటికలు ఇంటిగ్రేటెడ్ మార్కెట్,పురపాలక భవనం,డంప్ యార్డ్ వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ కవరేజిని 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచామని,23 కోట్ల 75 లక్షలతో గోదావరిఖని జనరల్ ఆసుపత్రి నందు 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్,26 కోట్లతో,51 కోట్లతో పెద్దపల్లిలో 100 పడకల ఆసుపత్రి,22 కోట్లతో మంథని లో 50 పడకల ఆసుపత్రి నిర్మిస్తున్నామని అన్నారు. ఎస్సీ వర్గీకరణ,బీసి లకు 42 శాతం రిజర్వేషన్ తో సామాజిక తెలంగాణ సాధనకు కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏ. అన్నయ్య గౌడ్,అదనపు కలెక్టర్లు జె.అరుణశ్రీ,డి.వేణు,డి.సి.పి కరుణాకర్,ఆర్.డి.ఓ. బి.గంగయ్య,కలెక్టరేట్ ఏ. ఓ. శ్రీనివాస్,జిల్లా అధికారులు,ప్రజా ప్రతినిధులు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.





# వికారాబాద్ జిల్లాలో ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

- ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేసిన ప్రముఖులు, నాయకులు, అధికారులు

**వికారాబాద్, (ప్రజాస్వరం)**

వికారాబాద్ జిల్లాలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రజా పాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత దినోత్సవం జరుపుకున్నారు. జిల్లాలో బిజెపి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయాల్లో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రజా పాలన దినోత్సవం పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా పరిషత్ కార్యాలయం లో పథకవిష్కరణ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.. అదనపు కలెక్టర్ సుధీర్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పీ కార్యాలయంలో కలెక్టర్ ప్రతీక్ జైన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లాలోని తాండూరు వికారాబాద్ పరిగి కొడంగల్ మున్సిపల్ కార్యాలయాల్లో మున్సిపల్ కమిషనర్లు జాతీయ జెండాను ఎగరవేశారు ఈ ప్రజా పాలన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లాలోని పరిగి నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ నారాయణరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

**జాతీయ సమైక్యతా దినోత్సవ శుభాకాంక్షలు: మెతుకు ఆనంద్**

జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ వికారాబాద్ పట్టణంలోని ఎన్నెపల్లిలో గల బీఆర్ఎస్ భవన్ ( పార్టీ జిల్లా కార్యాలయం)లో జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికి జాతీయ సమైక్యతా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు.



















# ప్రజలందరూ దేశ సేవకు, దేశాభివృద్ధికి పాటుపడాలి

- **రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్**
- **వికారాబాద్ కలెక్టరేట్లో జాతీయ జెండాను ఎగరవేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**
- **ఘనంగా ప్రజా పాలన దినోత్సవం**





**వికారాబాద్, సెప్టెంబర్ 17(ప్రజాస్వరం):**

ప్రజలందరూ తమ హక్కులను ఉపయోగించుకుంటూ బాధ్యతలను విస్మరించకుండా దేశ సేవకు, దేశాభివృద్ధికి పాటుపడాలని రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన తెలంగాణ ప్రజా పాలన దినోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ...సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజని, భారత స్వాతంత్ర్య పోరాటంలో జాతీయ నాయకులు పాల్గొని బ్రిటిష్‌వారి నుండి భారత జాతిని విముక్తి చేసినప్పటికీ ఆనాడు దేశవ్యాప్తంగా ఉన్న 562 సంస్థానాలలో మెజారిటీ సంస్థానాలు భారత దేశంలో విలీనమయ్యాయన్నారు. దేశమంతా 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య సంబరాల్లో కేరింతలు వేస్తుంటే హైదరాబాద్ సంస్థాన ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యానికై పోరాడుతూనే ఉన్నారని సభాపతి తెలిపారు. 85 శాతం ప్రజలు మాట్లాడే స్థానిక భాషపై అణిచివేత, వెట్టిచాకిరి, బానిసత్వం కొనసాగిందని మరోవైపు నిజాం ప్రైవేట్ సైన్యం మరియు రజాకార్ల దమనకాండ కొనసాగడంతో ఈ నిర్బంధానికి వ్యతిరేకంగా తెలంగాణా ప్రజలు చైతన్యం అయి సాయుధ రైతాంగా పోరాటాలు చేసి ఎంతో మంది తమ ప్రాణాలు కోల్పోయారని సభాపతి ఈ సందర్భంగా గుర్తు చేశారు. రైతులను రుణ విముక్తి చేయడానికి దేశ చరిత్రలోనే మొదటి సారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించిందని అన్నారు. వికారాబాద్ జిల్లాలో రైతు రుణ మాఫీ పథకం క్రింద మొత్తం 1 లక్ష 358 మంది రైతన్నలకు 8 వందల 49 కోట్ల రూపాయలు రుణ మాఫీ చేయడం జరిగిందని తెలిపారు.ఇందిరమ్మ రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేల పెట్టుబడి సాయాన్ని అందజేస్తున్నట్లు, కేవలం తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయగా ఈ పథకం క్రింద వికారాబాద్ జిల్లాలో ఈ వానాకాలంలో 2 లక్షల 76 వేల 537 మంది రైతులకు గాను 363 కోట్ల 10 లక్షల రూపాయలు ఆయా రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. నిరుపేదల ప్రతి ఒక్కరి సొంత ఇంటి కల నిజం చేయాలని రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వం లోని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని ఇందులో భాగంగా జిల్లాకు మంజూరైన 13 వేల 640 ఇళ్ళలో ఇప్పటివరకు 11 వేల 681 గృహాలు నిర్మించడానికి ఆమోదించడం జరిగిందని ఆయన అన్నారు.మహాలక్ష్మి పథకం క్రింద తెలంగాణ రాష్ట్రంలోని మహిళలందరికి ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించబడుచున్నదని అదేవిధంగా పేద కుటుంబాలకు 500 రూపాయలకే సబ్సిడీ వంట గ్యాస్ సిలిండర్ ను అందించి మహిళల వంటింటి కష్టాలను దూరం చేసిందని ఆయన అన్నారు. గృహ జ్యోతి పథకం కార్యక్రమం ద్వారా జిల్లాలో 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడుతున్న మొత్తం 1 లక్ష 39 వేల 812 కుటుంబాలకు ఉచితంగా సరఫరా జరుగుతున్నదని ఆయన తెలిపారు. చేయూత పథకం ద్వారా వికారాబాద్ జిల్లాలో మొత్తం 1 లక్షా 9 వేల 283 మంది లబ్దిదారులకు ప్రతి నెలా 27 కోట్ల 36 లక్షల రూపాయల ఆసరా పెన్షన్లు చెల్లించబడుతోందని ఆయన అన్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద జిల్లాలో 19 వేల 888 కుటుంబాలకు 11 కోట్ల 93 లక్షల చెల్లింపులు చేయడం జరిగిందన్నారు. పేదలు కడుపునిండా, తృప్తిగా అన్నం తినాలనే మంచి మనసుతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యాన్ని ఇస్తున్నట్టు అదేవిధంగా పదేళ్ళ తరువాత అర్హులైన వారందరికీ రేషన్ కార్డులను ఇచ్చే కార్యక్రమం జరుగుతున్నదని ఆయన అన్నారు.

ప్రభుత్వ వసతి గృహాలలో ఉంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడానికి పది సంవత్సరాల తరువాత డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచడం జరిగిందని ఆయన అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని 5 లక్షల రూపాయల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచిందని ఆయన తెలిపారు. జిల్లాలో రూ .235 కోట్ల వ్యయంతో వికారాబాద్ మెడికల్ కళాశాల, కొడంగల్ లో 125 కోట్ల రూపాయలతో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణంలో ఉన్నాయ ఆయన తెలిపారు.వికారాబాద్ లో నూతన జిల్లా ఆసుపత్రిని ప్రారంభించగా, పరిగి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను 30 పడకల ఆస్పత్రి నుంచి 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు. 2047 నాటికి భారతదేశ ముఖచిత్రాన్ని మార్చే గేమ్ ఛేంజర్ పాత్రలో తెలంగాణ కీలకంగా ఉండాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రజా ప్రభుత్వానిదని ఆ సంకల్పానికి దార్శనిక పత్రమే 'తెలంగాణ రైజింగ్ 2047' అని సభాపతి తెలిపారు. 2035 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను మార్చే మహత్తర లక్ష్య పత్రంగా తెలంగాణ రైజింగ్ 2047 ఉంటుందని, ఇది కేవలం ప్రణాళిక కాదు ప్రపంచ వేదికపై తెలంగాణను సగర్వంగా నిలబెట్టే సంకల్పంతో పని చేస్తుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా అభివృద్ధిలో ప్రజలు , ప్రజా ప్రతినిధులు , అధికారులను భాగస్వాములు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని సభాపతి తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాల విద్యార్థినీల సాంస్కృతిక కార్యక్రమాలు , తెలంగాణ సారధి కళాకారులు ఆలపించిన గేయాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థినీలకు స్పీకర్ చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు. తెలంగాణ ప్రజాపాల దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి, తాండూర్ శాసన సభ్యులు మనోహర్ రెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి, బీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# అమరుల త్యాగాల ఫలితమే స్వేచ్ఛ తెలంగాణ

- **రైతాంగ పోరాట యోధులకు, స్వాతంత్ర్య సమరయోధులు జోహార్లు....**
- **ప్రజా ప్రభుత్వం హయాంలో జిల్లా అభివృద్ధి లో ముందంజ....**
- **మహిళా సాధికారత కోసమే ఇందిరా మహిళ శక్తి పథకం....**
- **ఏడుపాయల, చర్చ్ అభివృద్ధికి నిధుల మంజూరు...**
- **జిల్లా ఇంచార్జీ మంత్రి వివేక్ వెంకటస్వామి..**
- **ఘనంగా ప్రజాపాలన దినోత్సవం వేడుకలు...**

**మెదక్ సెప్టెంబర్ 17 (ప్రజా స్వరం..**

రాచరిక వ్యవస్థ ను అంతమొందించి ఇప్పుడు అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్రం, ప్రజాస్వామ్యం ఎంతో మంది అమరుల త్యాగాల ఫలితమని జిల్లా ఇంచార్జీ మంత్రి వివేక్ వెంకటస్వామి గుర్తు చేశారు. బుధవారం మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా జిల్లా ఇంచార్జీ మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరైన తెలంగాణ తల్లి, జయశంకర్, అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ ప్రజా పాలన వ్యవస్థ ఆవిర్భావానికి నాంది పలికిన అమరులైన తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాట యోధులకు, స్వాతంత్ర్య సమరయోధులు అందరికీ నా జోహార్లు తెలిపారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజు, తెలంగాణ ప్రాంతం భారత్ యూనియన్ చేరి ప్రజా పాలన ప్రారంభమైన రోజు అన్నారు. ఈ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం మన సొంతం కావడానికి ఎంతో మంది ఈ గడ్డ మీద అసమాన త్యాగాలు చేశారని అన్నారు. ఆ రోజు వారి త్యాగాల ఫలితమే నేటి తెలంగాణా అభివృద్ధికి నాంది పలికిందనీ అన్నారు. దేశమంతా 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య సంబరాల్లో కేరింతలు వేస్తుంటే హైదరాబాద్ సంస్థాన ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యానికై పోరాడుతూనే ఉన్నారని అన్నారు. రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో మొదటిసారి అసువులు బాసిన దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమం తీవ్రతరమైదని, ఆనాటి పోరాటంలో చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలా దేవి కీలక పాత్ర పోషించారని అన్నారు. నల్లగొండ జిల్లా నుంచి బండి యాదగిరి రాసిన "బండెనకబండి కట్టి పదహారు బండ్లు కట్టి.. ఏ బండ్లో పోతావు కొడుకో.. నైజాం సర్కారోడో..." పాట సాయుధ పోరాటాన్ని ఉధృతం చేసి రాచరిక ప్రభుత్వం పై తిరుగుబాటు చేయడానికి ప్రజల్లో చైతన్యం రగిలించిందనీ అన్నారు. ప్రపంచ పోరాటాల చరిత్రలో తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటానికి ప్రత్యేక స్థానం ఉందనీ అన్నారు. అప్పటి ప్రధాన మంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ, హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి వల్ల 17 సెప్టెంబర్ 1948 నాడు హైదరాబాద్ సంస్తనం భారత దేశంలో విలీనం అయిందనీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు అభయహస్తం హామీలను ఒక్కొక్కటిగా అధికారంలోకి వచ్చిన 48 గంటల నుంచే అమలుచేయడం ప్రారంభించిందని పేర్కొన్నారు. ఇందిరమ్మ గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి ధరఖాస్తులు స్వీకరించి పథకాలు అమలు చేస్తున్నమని అన్నారు. మెదక్ జిల్లాలో ఇప్పటి వరకు 3 కోట్ల 55 లక్షల సార్లు మహిళలు ఈ ఉచిత రవాణా సౌకర్యాన్ని వినియోగించుకున్నారు. దీని ద్వారా మహిళలకు 87 కోట్ల 81 లక్షల రూపాయల లబ్ది చేకూరిందని అన్నారు. ఉచిత విద్యుత్ పథకం జిల్లాలో ఇప్పటి వరకు 1 లక్ష 27 వేల 381 విద్యుత్ వినియోగదారులకు 200 యునిట్ల లోపు జీరో బిల్లు జారి చేయడం జరిగిందని, ఈ పథకం ద్వారా ప్రభుత్వం మన జిల్లాలో ఇప్పటి వరకు 69 కోట్ల 19 లక్షల సబ్సిడి అందజేసినట్లు తెలిపారు.

రైతు భరోసా ద్వారా వానాకాలం 2025 సంవత్సరం లో మొత్తం 2,62,043 రైతుల ఖాతాల్లో 220 కోట్ల 84 లక్షల రూపాయలు జమ చేసినట్లు తెలిపారు. రైతు రుణమాఫీ ద్వారా మెదక్ జిల్లాలో రైతు రుణమాఫీ పథకం ద్వారా ఇప్పటి వరకు మొత్తం 87 వేల 491 మంది రైతన్నలకు 645 కోట్ల 41 లక్షల రూపాయల రుణమాఫీ చేయడం జరిగిందని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని 10 లక్షల రూపాయలకు పెంచడం ద్వారా జిల్లాలో 25 వేల 826 మంది పేదలు చికిత్సలు పొందారని, ప్రభుత్వం 68 కోట్ల 84 లక్షల రూపాయలు ఖర్చు చేసిందనీ అన్నారు. జిల్లాలో కొత్త మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీలను ప్రారంభించడం జరిగిందని అన్నారు. కొత్త మెడికల్ కాలేజీ బిల్డింగ్ కొరకు 180 కోట్ల, నర్సింగ్ కాలేజి బిల్డింగ్ కొరకు 26 కోట్ల మంజూరు చేసినట్లు తెలిపారు. 500 వంట గ్యాస్ ద్వారా మెదక్ జిల్లాలో ఇప్పటి వరకు 1 లక్ష 26 వేల 796 మంది వినియోగదారులకు 4 లక్షల 68 వేల 195 గ్యాస్ సిలిండర్లు జరిగిందని, దీనికి ప్రభుత్వం 13 కోట్ల 18 లక్షల సబ్సిడీ అందించిందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా జిల్లాలో 2 లక్షల 32 వేల 579 కుటుంబాలకు చౌక ధర దుకాణాల ద్వారా సెప్టెంబర్ 2025 మాసంలో 4 వేల 850 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో 18 వేల 808 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. మెదక్ జిల్లాలో 74 వేల 265 విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలను, వర్క్ బ్బుక్లు మరియు నోట్బుక్లు ఉచితంగా ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ సంవత్సరం నుండి 1 వ తరగతి నుండి 5వ తరగతి వరకు గల 32 వేల 773 విద్యార్థులకు కూడా నోట్బుక్లు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలో, హాస్టల్ లలో డైట్ చార్జీలు పెంచి నాణ్యమైన పోషకాలతో కూడిన భోజనం అందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల మరమత్తుల కొరకు 3 కోట్ల 26 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లాలో కొత్తగా 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రేసిడేన్సియల్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు చేశామని అన్నారు. మెదక్ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా మొదటి విడతలో 457 కోట్ల 70 లక్షల వ్యయంతో 9 వేల 154 ఇండ్లు మంజూరు చేశామని, అత్యదికమైన ఇండ్ల నిర్మాణ పనులు వివిధ దశలలో ఉన్నాయని, ఇండ్ల నిర్మాణ ప్రగతిని బట్టి ఇప్పటి వరకు 2 వేల 295 లబ్దిదారులకు 22 కోట్ల 96 లక్షల రూపాయలను వారి ఖాతాలలో జమ చేసినట్లు తెలిపారు. జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమం ద్వారా ఈ సంవత్సరం 37 లక్షల మొక్కలు నాటుట లక్ష్యం కాగా ఇప్పటి వరకు 31 లక్షల 23 వేల మొక్కలు నాటడమని అన్నారు. ఇందిరా మహిళా శక్తి భవనానికి 5 కోట్ల నిధులతో కేటాయించి పనులు ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఇందిరా మహిళ శక్తి పథకం ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లికేజీ ద్వారా 248.54 కోట్ల తో 29,160 మహిళా సభ్యులకు చిన్న తరహా వ్యాపారాలు పెట్టించి వారి ఆర్థిక ప్రగతికి తోడ్పడడం జరిగిందన్నారు. వడ్డీ లేని రుణాల కింద 10 వేల 574 మహిళ సంఘాలకు 21.69 కోట్ల రూపాయల వడ్డీ రాయితీ మంజూరి చేసినట్లు తెలిపారు. ఏడుపాయల వన దుర్గ అమ్మవారి పరిసరాల అభివృద్ధి కొరకు 35 కోట్ల తో, మెదక్ చర్చి పరిసరాల అభివృద్ధి కొరకు 29 కోట్ల 18 లక్షల నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించామని అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, మహిళా, శిశు సంక్షేమం, రోడ్లు, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీలు, మున్సిపాలిటీ, వాటర్ సప్లై, వెటర్నరీ, ఇతర అన్ని శాఖలలో విప్లవాత్మకమైన అభివృద్ధి సాధించామని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో, నేరాలు నిరోధించడంలో, రహదారుల ప్రమాదాల నివారణలో, మత్తు పదార్థాల మరియు సైబర్ నేరాల నియంత్రణ కొరకు కృషి చేస్తున్న పోలీస్ యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి విజయవంతం చేస్తున్న అధికారులకు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. జిల్లాను అన్ని రంగాలలో మొదటి స్థానంలో నిలుపుటలో ప్రజలు, ఉద్యోగులు, ప్రతి ఒక్కరు పని చేయాలనీ విజ్ఞప్తి కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు, అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి, ఆర్డీవో రమాదేవి, జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.








## ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం వేడుకలు

**మెదక్ సెప్టెంబర్ 17 (ప్రజా స్వరం)**

పెత్తందారుల బానిస సంకెళ్లు నుండి స్వేచ్ఛ తెలంగాణ పురుడు పోసుకున్న దినం నేటి రోజు అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్ గౌడ్ అన్నారు. బుధవారం తెలంగాణ విమోచన దినోత్సవ సందర్భంగా మెదక్ జిల్లా బిజెపి పార్టీ కార్యాలయంలో మెదక్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ జాతీయ జెండా ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచరిక వ్యవస్థ నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి పొందడం జరిగిందని అన్నారు. తెలంగాణ కోసం ఎందరో అమర వీరుల చేసిన త్యాగాల ఫలితమే స్వేచ్ఛ తెలంగాణ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, సుభాష్ గౌడ్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు శ్రీనివాస్, ఈర్ల రంజిత్ రెడ్డి, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు సతీష్ , మండల అధ్యక్షరాలు బెండ వీణ, నాయకులు విజయ్, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుక



**మెదక్ సెప్టెంబర్ 17 (ప్రజా స్వరం)**

హవేలీ ఘనపూర్ మండల కేంద్రంలో బుధవారం శ్రీ కాళికా మనుమయ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వానికి ఆది గురువు, దేవతలకు లోకాలు, ఆయుధాలు నిర్మించిన దేవశిల్పి, లంకాపురి, ద్వారకా, ఇంద్రప్రస్థం, మహాసభల నిర్మాత విశ్వకర్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వడ్ల రామచంద్రం, ఉపాధ్యక్షుడు రాము, ప్రధాన కార్యదర్శి కమ్మరి ఆంజనేయులు, కోశాధికారి ఫణిరాజు, కార్యదర్శి రమేష్, సభ్యులు, కమ్మరి బ్రహ్మం, ఫణిరాజు, లక్ష్మీనారాయణ, సుదర్శన్, బబ్లూ, తేజ తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

**శామీర్‌పేట, సెప్టెంబర్ 17ప్రజాస్వరం) :**

ప్రభుత్వ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో ప్రజలకు తమ వంతు సేవ అందిస్తూనే, తమ గౌరవాన్ని కాపాడుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టరేట్ లో తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డిలు పాల్గొన్నారు. బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ మను చౌదరి ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందరికి తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో భాగంగా ప్రజలకు తాము చేయగలిగినంత సేవలు అందించాలని కలెక్టరు సూచించారు. నీతి నిజాయితీగా తమ విధులు నిర్వహిస్తూ తమ గౌరవాన్ని కాపాడుకోవాలని తెలిపారు. అనంతరం తెలంగాణ గీతానికి గౌరవ వందనం చేసారు. ముందుగా జిల్లా కలెక్టరు, డిసిపిలు పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, జిల్లా గ్రంధాలయ సంస్థ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, డిఆర్డిఓ సాంబశివరావు, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్, డిఇఓ విజయకుమారి, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాంమోహన్, ఇంచార్జ్ డిఆర్డిఓ పిడి కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ఆర్ బాధితులకు అండగా ఉంటాం

### తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసిన బాధితులు

### అలైన్‌మెంట్ మార్పు వల్ల ఇబ్బందులు పడుతున్నామని రైతుల వినతి

### బాధితులకు భరోసా కల్పించిన కేటీఆర్



**వికారాబాద్, సెప్టెంబర్ 17(ప్రజా స్వరం) :**

తెలంగాణలో రీజనల్ రింగ్ రోడ్ భూసేకరణలో ప్రభుత్వం అలైన్‌మెంట్ మార్పు వల్ల ఇబ్బందులు పడుతున్న వికారాబాద్ నియోజకవర్గంలోని వికారాబాద్ మండలంలోని పులుసుమామిడి, పాతూర్, మోమిన్ పేట్ మండలంలోని టేకులపల్లి, దేవరంపల్లి గ్రామాలకు చెందిన రైతులు బుధ వారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ ను వికారాబాద్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సమక్షంలో కలవడం జరిగింది. ఈ సమావేశంలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి, మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్,



కార్తీక్ రెడ్డి, వికారాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. రీజనల్ రింగ్ రోడ్ పేరుతో తమ భూములు లాక్కునేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని కేటీఆర్ కు తమ బాధను రైతులు వివరించారు. తమ భూములను తమకు తెలియకుండానే సర్వేలు నిర్వహించి, తక్కువ ధరలకు లాక్కునేందుకు ఈ ప్రభుత్వం శతవిధాల ప్రయత్నం చేస్తుందని, వారి నుండి ఎలాగైనా తమ భూములను కాపాడాలని కేటీఆర్ ను కోరారు. బాధితుల బాధలు విన్న కేటీఆర్ వారికి ఈ విషయంలో ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ గారితో ఫోన్లో మాట్లాడిన ఆయన... పేద రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని, ఎక్కడ కూడా పొరపాట్లకు తావు లేకుండా చట్టప్రకారం భూసేకరణ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేట్ వ్యక్తుల భూములను ఇబ్బంది పెట్టేలా భూసేకరణ చేసేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, రైతులను కాదని నిర్బంధాల మధ్య సర్వే చేసి, భూసేకరణ చేయడం తగదన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు సంతృప్తి కలిగేలా పరిహారం అందించి, వారి పూర్తి అంగీకారంతో భూ సేకరణ జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ పార్టీకి మోసం అనేది వెన్నతో పెట్టిన విద్య అని గతంలో కూడా ఔటర్ రింగ్ రోడ్ అంశంలో ఇదే విధంగా సొంత అజెండాలతో ముందుకు వెళ్లిందన్నారు. రీజినల్ రింగ్ రోడ్ భూసేకరణలో కూడా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఒరిజినల్ అలైన్‌మెంట్ కాకుండా సొంత డబ్బులతో కడుతున్నామని చెప్పి తమవారి భూములను కాపాడుకునేందుకు ప్రయత్నం చేస్తోందని అన్నారు. అందుకోసం వేలాదిమంది రైతుల జీవితాలను దెబ్బతీస్తోందని విమర్శించారు. రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో చట్టప్రకారం వ్యవహరించాలని, ప్రభుత్వం ఇష్టానుసారంగా భూములు లాక్కుంటామంటే మాత్రం బాధితుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.



## తూముకుంట ప్రజాపాలన వేడుకలు

**శామీర్‌పేట, సెప్టెంబర్ 16 (ప్రజాస్వరం) :**

తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా బుధవారం తూంకుంట పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కమిషనర్ ఏంఎన్ఆర్ జ్యోతి చేతుల మీదుగా జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి కార్యాలయ మేనేజర్ స్. శ్రవణ్ కుమార్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు. స్వచ్ఛత హి సేవ పోస్టర్ 2025 ఆవిష్కరణ ఈ కార్యక్రమం అనంతరం నేటి నుండి అక్టోబర్ 2 తారీకు వరకు జరిగే స్వచ్ఛత హి సేవ 2025కార్యమానికి సంబంధించిన పోస్టర్ మున్సిపల్ కమిషనర్ ఏంఎన్ఆర్ జ్యోతి రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం

**మాసాయిపేట,సెప్టెంబర్ 17( ప్రజాస్వరం)**

మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలో తెలంగాణ విమోచన దినం భారతీయ జనతా పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద బిజెపి మండల పార్టీ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి జాతీయ జెండా ఎగరవేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం పురస్కరించుకొని కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. నేటి నుండి 15 రోజులపాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన అమరవీరుల త్యాగం మరువలేనిదని ఈ సందర్భంగా వారు అన్నారు ఈకార్యక్రమంలోబిజెపిఅధ్యక్షుడునాగేందర్ రెడ్డి మాజీఅధ్యక్షుడువేణుగోపాల్. ప్రధాన కార్యదర్శి నవీన్ యాదవ్ ఉపాధ్యక్షులు పాపన్న శ్రీకాంత్.శివకుమార్ గౌడ్. శక్తి కేంద్రం రామునాయక్ భూత అధ్యక్షుడు యాదగిరి నాయకులు కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు



## మోదీ జన్మదినం సదర్భంగా రక్త దానం





**మెదక్ సెప్టెంబర్ 17 (ప్రజా స్వరం)**

ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం పురస్కరించుకొని బుధవారం మెదక్ జిల్లా బిజెపి కార్యాలయంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేశం గౌడ్ హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం, దేశ అభివృద్ధి కోసం రోజుకు 18 గంటలు పని చేస్తున్న నిఖార్సైన నాయకుడు నరేంద్ర మోడీ అన్నారు. దేశం కోసం సర్వం అర్పిస్తూ ప్రపంచంలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలిచిన మహోన్నత వ్యక్తి మానవీయ విలువలు కలిగి వ్యక్తి ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, సుభాష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు శ్రీనివాస్, రంజిత్ రెడ్డి, ఉపాధ్యక్షులు శంకర్ గౌడ్, జిల్లా కార్యదర్శులు కల్కి నాగరాజ్, బాదే బాలరాజు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, జిల్లా నాయకులు లోకేష్, ఆకుల ప్రభాకర్, శివ, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, మండల అధ్యక్షురాలు వీణ, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# నిజాం రాచరికం నుండి విముక్తి

- ఊషన్నపల్లి ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య



**కాల్వశ్రీరాంపూర్/పెద్దపల్లి, సెప్టెంబర్17(ప్రజా స్వరం) :**

హైదరాబాద్ సంస్థానాధీశుడు 7వ నిజాం నవాబ్ ఉస్మాన్ అలీఖాన్ నుంచి హైదరాబాదును విముక్తి చేసిన సందర్భంగా ఈరోజు ప్రజాపాలన దినోత్సవం (తెలంగాణ విమోచన దినోత్సవం) జరుపుకుంటున్నామని,ఇది అణచివేత నుంచి విముక్తి అయిన రోజు అని ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య అన్నారు.బుధవారం ఆయన పాఠశాలలో జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం సైనిక చర్యకు తలొగ్గి అప్పటి నిజాం నవాబ్ హైదరాబాద్ సంస్థానాన్ని ఇండియన్ యూనియన్లో విలీనం చేశారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అప్పటి హైదరాబాద్ సంస్థానంలో ప్రజలు తీవ్ర అన్యాయానికి,అణచి వేతకు గురయ్యారన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సురేష్ కుమార్,పిల్లలు,పలువురు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

- ఏంఈఓ మహేష్ ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య
- ఊషన్నపల్లి స్కూల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభం



**కాల్వశ్రీరాంపూర్/పెద్దపల్లి,సెప్టెంబర్17(ప్రజా స్వరం):**

పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులను బుధవారం ఎంఈఓ సిరిమల్ల మహేష్ ప్రారంభించారు.మండలంలోని ఊషన్నపల్లి ప్రభుత్వ పాఠశాలకు ప్రభుత్వం ఇటీవల ప్రైమరీ సెక్షన్ మంజూరు చేసింది.దీనికిగాను ఈ ప్రీ ప్రైమరీ పాఠశాలకు ఒక ఇన్స్ట్రక్టర్,ఒక ఆయా నియమకానికి గత నెలలో దరఖాస్తులు ఆహ్వానించగా గ్రామం నుంచి పలువురు విద్యావంతులైన యువతీ,యువకులు సంబంధిత పోస్ట్ కు దరఖాస్తు చేసుకున్నారు.ఈనెల 16న జిల్లా విద్యాశాఖ అధికారిని సంబంధిత పోస్ట్ ల ఫలితాలు విడుదల చేయడంతో బుధవారం ఎంఈఓ మహేష్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈర్ల సమ్మయ్యతో కలిసి ఊషన్నపల్లి ప్రీప్రైమరీ పాఠశాల తరగతులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని,తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఊషన్నపల్లి ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని ఆయన కోరారు.ప్రీ ప్రైమరీ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని నూతనంగా నియమితులైన ఇన్స్ట్రక్టర్ ఆయాలకు సూచించారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ ఊషన్నపల్లి ప్రభుత్వ పాఠశాలకు మంద (కొనుకటి) శ్రీవాణి ఇన్స్ట్రక్టర్ గా,ఎడ్ల (బండారి) స్రవంతి ఆయాగా మెరిట్ ప్రాతిపదికన ఎంపికయ్యారని,అధికారుల ఆదేశానుసారం బుధవారం వారిని పాఠశాలలో జాయిన్ చేసుకున్నట్లు ఈర్ల సమ్మయ్య తెలిపారు.చిన్నారులకు ఆటపాటలతో కూడిన చక్కటి విద్యను అందించాలని ఈర్ల సమ్మయ్య కోరారు.ఈ కార్యక్రమంలో ఎఎపిసి చైర్పర్సన్ పెండ్లి స్వరూప,ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అమృత సురేష్ కుమార్,మంద శ్రీవాణి,ఎడ్ల స్రవంతి,పిల్లల తల్లిదండ్రులు కూస సతీష్,కూస రాజు,కొనుకటి శ్రీకాంత్,బండారి శంకర్,మధ్యాహ్న భోజన నిర్వాహకులు విజయలక్ష్మి,ధరణి రజని,పైడిపల్లి లింగయ్య,విజయలక్ష్మి,సతీష్ పలువురు గ్రామస్తులు,విద్యార్థినీ,విద్యార్థులు,పలువురు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానం



**శామీర్ పేట సెప్టెంబర్ 17(ప్రజాస్వరం) :**

శామీర్పేట మండలం స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల కార్యక్రమం బుధవారం శామీర్ పేట మండల ప్రజా పరిషత్ హాల్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ఏంఈఓ కమలాకర్ అధ్యక్షత వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులు మండలంలో ఏడుగురు ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్టిఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గోపాల్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి, లక్ష్మీ, వెంకట్ రెడ్డి, సంఘ బాధ్యులు టిఎస్ యుటిఎఫ్ శామీర్పేట మండల అధ్యక్షులు తిరుమలేష్ గారు ప్రధాన కార్యదర్శి కుమార్, పిఆర్టియు టిఎస్ అధ్యక్షులు మహేష్, ప్రధాన కార్యదర్శి గోపాల్, పిఈటిఏ టిఎస్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, టిపిర్టియూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి, టీయుటిఫ్ జిల్లా అధ్యక్షులు రాజు, ఎస్టియూటిఎస్ శామీర్ పేట మండల అధ్యక్షులు సురేందర్, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుగ్రహీత భాను ప్రకాష్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు మురళి, ఉపాధ్యాయులు రవీంద్ర చారి, సత్యనారాయణ, శ్రీనివాస్, మంజుల, రమాదేవి పాల్గొన్నారు.

# 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' ప్రారంభం

- అక్టోబర్ 2 వరకు ప్రత్యేక క్యాంపుల నిర్వహణ
- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**పెద్దపల్లి,సెప్టెంబర్17(ప్రజా స్వరం) :**

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించేందుకు స్వస్త్ నారీ,సాశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం అమలు చేస్తున్నామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు.పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం స్వస్త్ నారీ,సాశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రారంభించారు.ఈ సందర్భంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ ఇల్లు బాగుండాలంటే మన ఇంటిలోనే మహిళలు వారి ఆరోగ్యం బాగుండాలని అన్నారు.మహిళల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా కేంద్ర ప్రభుత్వ పథకాన్ని వినియోగించుకుంటూ వైద్య పరీక్షలు చేసుకోవాలని అన్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య క్యాంపులో హెల్త్ చెక్ అప్ చేసుకొవాలని అన్నారు.వ్యాధి నిర్ధారణ జరిగిన మహిళలకు సంబంధిత చికిత్సను కూడా ప్రభుత్వం అందిస్తుందని అన్నారు.మహిళల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో ప్రతినెల దాదాపు 200 పైగా ప్రసవాలు విజయవంతంగా జరుగుతున్నాయని,ఈ సేవలు కూడా వినియోగించుకోవాలని తెలిపారు.ఆసుపత్రి అభివృద్ధి,అంబులెన్స్ సేవలు అందించేందుకు అవసరమైన



సోమ్ము ఎంపీ నిధుల నుంచి అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ స్వస్త్ నారీ,సాశక్త్ పరివార్ అభియాన్ అనే కార్యక్రమాన్ని నేడు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారని అన్నారు.మన కుటుంబంలో ఉన్న మహిళ ఆరోగ్యంగా ఉంటే,కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుంది అనే ఉద్దేశంతో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు 15 రోజులు మహిళల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల పట్ల ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని అన్నారు.జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులు,పి.హెచ్.సి లలో స్పెషాలిటీ డాక్టర్లను ఏర్పాటు చేసి మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించడం జరుగుతుందని అన్నారు. హైపర్ టెన్షన్,డయాబెటిస్,బ్రెస్ట్ క్యాన్సర్, సర్వికల్ క్యాన్సర్,ఓరల్ క్యాన్సర్,అనేమియా,టీబీ వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరుగుతాయని అన్నారు.గైనకాలజిస్ట్,ఐ స్పెషలిస్ట్,ఇయర్స్ స్పెషలిస్ట్,డెర్మటాలజిస్ట్,డెంటల్ సర్జన్ వంటి ప్రత్యేక వైద్యుల సేవలను వినియోగించుకొంటున్నామని అన్నారు.మహిళలు తమకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉన్న కూడా సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వాణిశ్రీ,జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు

**గుమ్మడిదల, సెప్టెంబర్ 17 (ప్రజాస్వరం) :**

మండలంలోని అన్నారం మున్సిపాలిటీ పరిధిలో గల ప్రకృతి నివాస్ రిసార్ట్ విశాల్ ప్రాజెక్టులో భారత ప్రధాని శ్రీ. నరేంద్ర మోడీ గారి 75వ జన్మదినం సందర్భంగా ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. తదానంతరంకార్యక్రమాన్ని గుమ్మడిదల భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు కావలి ఐలేష్ మరియు మహిళా మోర్చా అధ్యక్షురాలు సార సృజనలక్ష్మి ఆధ్వర్యంలో అన్నారం,గుమ్మడిదల ప్రభుత్వ ఆసుపత్రిలో మరియు ప్రాథమిక ఉన్నత పాఠశాల అన్నారంలో పాఠశాల పిల్లలకు మిఠాయిలు,పండ్లు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పట్టణ ప్రభోధన్, ఆర్ఎస్ఎస్ వక్త గోవర్ధన్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పలుగు గోవర్ధన్ రెడ్డి, అన్నారం మున్సిపల్ మాజీ పంచాయతీ సభ్యులు నీనాగో స్వామి, మండల ప్రధాన కార్యదర్శి రాజు, మండల సీనియర్ నాయకులు ఇంద్రసేనారెడ్డి, మాజీ అధ్యక్షులు బజరంగ్దళ్ మండల అధ్యక్షులు పంకజ్ఞొక్కడే, బీజేవైఎం యువమోర్చా మండల అధ్యక్షులు అనిల్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు యాదగిరి, మాజీ ప్రధాన కార్యదర్శి, బిచ్చగారి రామ్ రెడ్డి, మండల పదాధికారుల సెక్రటరీ ముత్యాల గౌడ్, కోశాధికారి రాజశేఖర్, ఉపాధ్యక్షులు సంజీవ,నల్లవల్లి శేఖర్, మాజీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు భాస్కర్ గౌడ్,భూత్ అధ్యక్షులు తాళ్ల నరసింహ, దర్గా స్వామి, శివరాత్రి రాజు రాయి రాజశేఖర్ రెడ్డి, ప్రకృతి నివాస్ సీనియర్ సిటిజన్స్ అన్నారం భూత్ కమిటీ సభ్యురాలు అనిత కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.





# జర్నలిస్ట్ సాగర్‌ను ఆదుకుంటాం

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**మంథని/ పెద్దపల్లి,సెప్టెంబర్17(ప్రజా స్వరం) :**

పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన జర్నలిస్ట్ మీరాల సాగర్ ను ఆర్థికంగా ఆదుకుంటామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. మంథని పట్టణంలో బుధవారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పర్యటించారు.మాజీ కేంద్ర మంత్రి తన తాత గడ్డం కాక వెంకట స్వామీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించాడు.మంథని పట్టణంలోని మంథని సివిఆర్ న్యూస్ ఛానల్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ మిరియాల సాగర్ ఉత్తరప్రదేశ్ లో జరిగిన మహా కుంభమేళా కు వెళ్లి వస్తుండగా కారు చెట్టుకు ఢీకొని గాయాల పాలయ్యాడు. మిరియాల సాగర్ ను పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ పరామర్శించి తన యోగక్షేమాలు తెలుసుకున్నాడు.తనకు కావలసిన సహాయము చేస్తానని మాట ఇచ్చారు.

# ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

**జవహర్ నగర్, సెప్టెంబర్ 17 ( ప్రజాస్వరం):**

తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం పురస్కరించుకొని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం వేడుకలు నిర్వహించారు. ప్రత్యేక అధికారి అలివేలు మంగతయారు జెండా ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ ఎన్ వసంత, మునిసిపల్ డి ఇ మాధవ చారి, మేనేజర్ నగేష్ బాబు, ఆర్ ఓ వెంకటేశం, జూనియర్ అసిస్టెంట్ లు, వార్డు ఆఫీసర్స్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# తెలంగాణ భవన్‌లో జాతీయ సమైక్య దినం

- కుల మతాలకతీతంగా కేసీఆర్ సమైక్య పాలన
- బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కోరు కంటి చందర్

**పెద్దపల్లి, సెప్టెంబర్17(ప్రజా స్వరం):**

తెలంగాణ ఉద్యమ రథసారథి,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ సమైక్య దినంగా ప్రకటించిన నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కోరు కంటి చందర్,మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డితో కలిసి జాతీయజెండా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశంలో ఒకే జాతి,ఒకే దేశం నినాదంతో కెసిఆర్ సెప్టెంబర్ 17 ను సమైక్య దినంగా ప్రకటించారని,కులాల పేరిట,మతాల పేరిట వేరైతే దేశం లో అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని,అందరు కలిసి ఉన్నప్పుడే దేశం బాగుపడుతుందని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకే ఈరోజు ఘనంగా జాతీయ సమైక్య దినం జరుపుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్,మాజీ వైస్ చైర్మన్ మోబిన్,మాజీ కౌన్సిలర్ పూదర్ చంద్రశేఖర్,బిఆర్ఎస్ నాయకులు నారాయణదాసు మారుతి,జావేద్,వెన్నం రవీందర్,మధు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# పుట్ట మధుకర్ జోలికి వస్తే ఊరుకోం

- మంథని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా

**మంథని/పెద్దపల్లి,సెప్టెంబర్ 17(ప్రజా స్వరం):**

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ జోలికి వస్తే ఊరుకునేది లేదని బిఆర్ ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ శ్రేణులను హెచ్చరించారు.పెద్దపల్లి జిల్లా మంథని అంబేద్కర్ చౌరస్తా వద్ద బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ధర్నా చేపట్టారు. మంథనిలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఇంటి ముందు కాంగ్రెస్ శ్రేణులు చేసిన ధర్నా కు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు బుధవారం నిరసనకు దిగారు.మంత్రి శ్రీధర్ బాబు డౌన్ డౌన్ అంటూ బిఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేశారు.మంథని నియోజకవర్గంలో 40 ఏళ్ల పాటు పరిపాలించిన శ్రీధర్ బాబు కుటుంబం ఒక్క అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టారా అని విమర్శించారు.కమాన్ పూర్ మండలం పెంచికల పేట్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే దొంగ చాటుగా కాంగ్రెస్ నాయకులు రాత్రి విగ్రహాన్ని ఏలా ఆవిష్కరిస్తారనీ నాయకులు ప్రశ్నించారు. ఇంకోసారి పుట్ట మధు ఇంటి మీదికి గొడవకు వస్తే ఊరుకునేలేదని మేమేందో చూపిస్తామని బిఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.ధర్నా వద్దకు భారీగా పోలీసులు చేరుకొని విరమింప చేశారు.ఈ కార్యక్రమంలో తగరం శంకర్ లాల్,ఏగొలపు శంకర్ గౌడ్,కనవేన శ్రీనివాస్ బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**జవహర్‌నగర్, (ప్రజాస్వరం ):**
భారత ప్రధాని నరేంద్ర మోడీ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ లో బిజెపి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జవహర్‌నగర్ ఈస్ట్ బీజేపీ శాఖ అధ్యక్షుడు కర్లపూడి జోగారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ప్రపంచ దేశాలలో భారత దేశ కీర్తి ప్రతిష్ఠలను పతాక స్థాయికి తీసుకెళ్లిన ప్రధాని నరేంద్ర మోడీ ఇలాంటి నాయకుడు మరొకరు లేరని వారన్నారు. ఈ కార్యక్రమంలో రక్తదాన శిబిరం జవహర్ నగర్ కన్వీనర్ అనిల్ గుప్తా, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు మహేందర్ యాదవ్ , పచ్చిమ శాఖ అధ్యక్షులు కమలాకర్, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు మైపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు గిరి కత్తుల వెంకన్న, డాక్టర్ యాదగిరి,విష్ణువర్ధన్ రెడ్డి, అశోక్, శ్రీధర్, కనకరాజు , లిఖిత యాదవ్ ,మాధవి లత, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ అదృశ్యం

**జవహర్ నగర్, (ప్రజాస్వరం) :**
వాటర్ డ్రైవర్ అదృష్టమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పోలీస్ స్టేషన్ పరిధిలోని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ శాంతినగర్ లో నివసించే ఎరుగదిన్నెల నవీన్ (23) ఆటో డ్రైవర్ విధులు నిర్వహిస్తున్నాడు రోజు మాదిరిగానే ఈనెల 14వ తేదీన ఆటో తీసుకొని వెళ్లిన నవీన్ అదే రోజు రాత్రి భార్యకు ఫోన్ చేసి కొంచెం ఆలస్యం అవుతుంది అని చెప్పాడు ఇంటికి రాకపోయేసరికి 15వ తేదీ ఉదయం భర్త భార్యకేత ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో బంధువులు,



తెలిసిన వారి వద్ద ఎంతో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం జవహర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

## ఘనంగా విశ్వకర్మ మహా యజ్ఞం



**జవహర్‌నగర్, (ప్రజాస్వరం) :**
జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బృందావన్ కాలనీలో బుధవారం విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో శ్రీ శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల, బిఆర్ఎస్ నాయకులు,విశ్వకర్మ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మెగా హెల్త్ క్యాంప్ ప్రారంభించిన స్పీకర్



**వికారాబాద్, (ప్రజా స్వరం):**
వికారాబాద్ పట్టణంలోని రాజీవ్ నగర్ లో బుధవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో "స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా మెగా హెల్త్ క్యాంప్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శాసన సభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. పరిగి ఎమ్మెల్యే టీ.రామ్మోహన్ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి ఆలయంలో అన్నదానం



**శామీర్‌పేట, సెప్టెంబర్17 (ప్రజాస్వరం) :**
శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద ఘనంగా అన్నదానం చేపట్టారు. బుధవారం శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపల్ ఉప్పర్ పల్లి పరిధిలోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద కొంపల్లికి చెందిన సురభి చంద్రశేఖర రావుకృష్ణకుమారి దంపతులు, వారి కుటుంబ సభ్యులు అనన్య, వరణ్యలు అన్నదానం చేపట్టారు. వివిధ గ్రామాల భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

# నీకు దమ్ముంటే శ్రీపాదరావు విగ్రహాన్ని ముట్టుకొని చూడు

- పుట్ట మధుకర్ కు ముత్తారం కాంగ్రెస్ నాయకుల సవాల్
- రాజకీయ బీక్ష పెట్టిన వారిపై అనాలోచితంగా మాట్లాడితే ఊరుకునేది లేదు
- దుద్దిల్ల కుటుంబం తోనే మంథని నియోజకవర్గం అభివృద్ధి
- ముత్తారం ప్రెస్ మీట్లో కాంగ్రెస్ నాయకులు



**ముత్తారం/పెద్దపల్లి,సెప్టెంబర్17(ప్రజా స్వరం):**
పుట్ట మధు నీకు దమ్ముంటే శ్రీపాద రావు విగ్రహాన్ని ముట్టుకొని చూడు అని ముత్తారం కాంగ్రెస్ నాయకులు పుట్ట మధుకర్ కు సవాల్ విసిరారు. ఇకనైనా పుట్ట మధు నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని లేకపోతే తగిన మూల్యం తప్పదని ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు.ముత్తారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీపాద రావు మాజీ జెడ్పిటిసి పుట్ట మధు కు రాజకీయ భిక్ష పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు.శ్రీపాద రావు మంథని నియోజకవర్గ అభివృద్ధి కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రతినిధిగా ఆ పదవికి వన్నె తెచ్చి దేశంలోనే ఒక గొప్ప స్పీకర్ గా పేరు పొందరాని పేర్కొన్నారు.మంథని నియోజకవర్గ ప్రజలు శ్రీపాద రావు ను మూడుసార్లు శ్రీధర్ బాబు ను ఐదు సార్లు ఈ ప్రాంత ప్రజలు గెలిపించారని దుద్దిల్ల శ్రీధర్ బాబు నిత్యం ప్రజల్లో ఉంటూ ఈ ప్రాంతంలో ఉన్నటువంటి ప్రజానీక సమస్యలు పరిష్కరిస్తూ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గారు అందించినటువంటి రాజ్యాంగం ద్వారా ఈ ప్రాంతంలో ఉన్నటువంటి బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం వారందరినీ సమానంగా చూస్తూ ఈ ప్రాంత అభివృద్ధి కోసం దళిత బహుజనుల అభివృద్ధి కోసం కృషి చేస్తూన్నారని తెలిపారు.పుట్ట మధు ఏదైతే రాబోయే రోజులలో ఈ ప్రాంతంలో ఉన్నటువంటి శ్రీపాద రావు విగ్రహాలు కులుచుతామని మాట్లాడడం సిగ్గుచేటని నీకు దమ్ముంటే ఒకసారి శ్రీపాద రావు విగ్రహాన్ని ముట్టుకొని చూడు కాంగ్రెస్ పార్టీ కార్యకర్త నాయకులు సత్తా ఏందో నీకు చూపిస్తామని ఆగ్రహంతో హెచ్చరించారు.ఇప్పుడు నీ ఇంటి ముందు ధర్నాకు దిగినం రాబోయే రోజులలో నిన్ను రోడ్డుమీద తిరగకుండా తరిమికొడదామని హెచ్చరించారు.శ్రీపాద రావు మరియు శ్రీధర్ బాబు మోచేతి నీళ్లు తాగి ఇవాళ దుద్దిళ్ల కుటుంబం పైనే ఆరోపణలు చేస్తావున్నావని,గతంలో నువ్వు జెడ్పిటిసిగా గెలిచినప్పుడు నా దైవ సమానులు అయినటువంటి శ్రీపాద రావు అని ప్రమాణం చేసి నువ్వు ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది గుర్తుందా అని అడిగారు.లాయర్ వామన రావు దంపతుల హత్య కేసులో సిబి సిబిఐలో విచారణ జరుగుతున్నందున భాగోతం బయటపడుతుందని భయంతో నోటికి వచ్చినట్టు మాట్లాడతా ఉన్నావని సిబిఐ త్వరలోనే విచారణ జరిపి నిన్ను కటకటాలకు పంపిస్తుందన్నారు. ఇంకోసారి శ్రీపాద రావు,శ్రీధర్ బాబు,శ్రీను బాబు ల పైన అనుచిత వాక్యాలు చేస్తే ఖబర్దార్ అని హెచ్చరించారు.ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ,ఎస్సీ సెల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కమాన్ పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య,ముత్తారం గ్రామ మాజీ సర్పంచ్ తూటి రజిత రఫీ,ఎస్సి సెల్ మండల అధ్యక్షుడు ఏడవేన సంపత్,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బక్కతట్ల వినీత్,మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు వాజిద్ పాష,కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గాదం శ్రీనివాస్,పిఎసిఎస్ చైర్మన్ అల్లాడి యాదగిరి రావు,మార్కెట్ కమిటీ డైరెక్టర్ డైరెక్టర్ బోలినేని బుచ్చం రావు,మాజీ సర్పంచ్ తాటిపాముల వకులరాణిశంకర్,ముత్తారం మండల సోషల్ మీడియా ఇన్చార్జ్ కోల విజయ్,కుక్కల చందు ,అమ్ము వెంకటస్వామి,గుడి కొండల్ రెడ్డి,కసిఒజ్జుల చారి,అల్లం దేవేందర్ రెడ్డి,తోడేటి శశి కుమార్,ఆకోజు అశోక్,లక్కం రాజు,పసునూటి శంకర్,మాదాసి రవీందర్,కల్వచర్ల రాజకుమార్,చొప్పరి సదయ్య,భోగం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ సాయుధ పోరాటం చరిత్రాత్మకం

### సీపీఐ నియోజకవర్గ నాయకులు సురేష్ కుమార్



**కొడంగల్, సెప్టెంబర్ 17(ప్రజా స్వరం) :**
నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అని కొడంగల్ అసెంబ్లీ సెగ్మెంట్ సిపిఐ నాయకులు గంటి సురేష్ కుమార్ అన్నారు. బుధవారం కోడంగల్ లోని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ పోరాట వారోత్సవాల సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో సిపిఐ పార్టీ జెండా ను నియోజకవర్గ నాయకులు గంటి సురేష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని అన్నారు. నిజం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించింది కమ్యూనిస్టులేనన్నారు. ఆ పోరాటాన్ని హిందూ ముస్లింల మధ్య జరిగిన గొడవగా బీజేపీ పార్టీ వక్రీకరిస్తుందని ఆరోపించారు. 4500 మంది కమ్యూనిస్టు అమరుల రక్తతర్పణంతో నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణకు విముక్తి కలిగిందని, అయితే హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేసినప్పటికీ కమ్యూనిస్టులు బలోపేతం కాకుండా నాటి నెహ్రూ, పటేల్ సేనలు ఇక్కడి కమ్యూనిస్టులపై యుద్ధం ప్రకటించినట్లు చెప్పారన్నారు. బ్రిటిష్ ముష్కరుల పాలన నుండి భారతదేశానికి ఆగస్టు 15, 1947 న స్వాతంత్ర్యం వచ్చినప్పటి హైదరాబాద్ సంస్థాన నిజాం నవాబు తమ ఆధీనంలో పెట్టుకుని హైదరాబాద్ ప్రత్యేక దేశంగా పాలన సాగిస్తూ దొరలు, దేశముఖ్ లు, జమిందార్ లు, జాగీర్దార్లు, రజాకార్లతో తెలంగాణ ప్రజలను పన్నుల రూపంలో చిత్రహింసలకు గురి చేస్తున్న రోజుల్లో పుచ్చలపల్లి సుందరయ్య,బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణ రెడ్డి, మాక్దూమ్ మోహినోద్దీన్, భీమ్ రెడ్డి నరసింహారెడ్డి తదితర కమ్యూనిస్టు నాయకులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. దున్నేవాడికే భూమి ఇవ్వాలని 10 లక్షల ఎకరాల భూమిని పంచిన ఘనత కమిస్టులకు ఉందన్నారు,చరిత్ర చెరిపేస్తే పోయేది కాదని కమ్యూనిస్టుల నాయకత్వంలో 4500 మంది అమరుల ప్రాణత్యాగంతో నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణకు స్వాతంత్రం సిద్ధించిందని అన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ తోపాటు కొన్ని పార్టీలు ఈ చరిత్రను వక్రీకరిస్తున్నాయని, హిందూ, ముస్లింల గొడవగా, వల్లభాయ్ పటేల్ సైనిక చర్యతో భారతదేశంలో హైదరాబాద్ ను విలీనం చేశారని తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు మండిపడ్డారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న అమరులను స్మరించుకుంటూ వారి పోరాట స్ఫూర్తితో పాలక ప్రభుత్వాల విధానాలపై పోరాటాలు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా ప్రస్తుత రాజకీయాలు భ్రష్టుపట్టిపోగా, రాజకీయ కాంక్షతో బజారున పడి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు, ఈ కార్యక్రమంలో లాలయ్య. బాబ్యా నాయక్. శంకర్ నాయక్. అశోక్. హుస్సేన్. రాజు నాయక్. పాషా. ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ పరిపాలన అధికారులను క్లస్టర్ వారీగా నియామకం

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్, సెప్టెంబర్ 17(ప్రజా స్వరం):**
గ్రామ పరిపాలన అధికారుల కేటాయింపు పూర్తి పారదర్శకంగా కౌన్సిలింగ్ ద్వారా జరిగిందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.
బుధవారం కలెక్టరేట్ సమావేశం హాలు నందు గ్రామ పాలన అధికారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. జిల్లాలో భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామ పరిపాలన అధికారుల నియామకానికి శ్రీకారం చుట్టిందని, వారికి రాత పరీక్ష నిర్వహించి అర్హులైన వారికి ఈ నెల 5 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందచేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జిల్లాకు సంబందించిన 139 మందికి క్లస్టర్ వారీగా మండలాలకు కేటాయించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కౌన్సిలింగ్ ద్వారా నియమించిన వారందరికి ఉత్తర్వులు జారీ చేస్తామని, రేపటి నుండి విధుల్లోకి చేరాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, డి ఆర్ ఓ మంగ్లీ లాల్, ఎ ఓ ఫర్వీన్ కాతున్, తదితరులు ఉన్నారు.

## వ్యక్తి ప్రాణాలు తీసిన గుంతల రోడ్డు



**వికారాబాద్, సెప్టెంబర్ 17(ప్రజా స్వరం) :**
వికారాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలోని కొత్త గడి వద్ద బుధ వారం జరిగిన రోడ్డు ప్రమాదం ఓ వ్యక్తి మృతి చెందారు. వికారాబాద్ మోమిన్పేట్ మార్గంలో ఈ రోడ్డు మార్గంలో ఎక్కడ అంటే అక్కడ అడుగుకో గుంత ఉండడంతో బైకిస్ట్ ప్రాణం తీసింది. వికారాబాద్ కొత్తగాడి దగ్గర బైక్ పై వెళుతున్న వ్యక్తి గుంత రావడంతో బైక్ అదుపు తప్పి పడగ అదే సమయంలో స్పీడ్ గా వెళ్తున్న ఓ డీసీఎం పైనుండి వెళ్లడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు.

# ఘనంగా మోడీ జన్మదిన వేడుకలు

## వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన మండల బిజెపి నాయకులు

**వర్గల్ / గజ్వేల్ (ప్రజాస్వరం) :**
నరేంద్ర మోదీ 75 వ జన్మదిన వేడుకలను బీజేపీ మండల అధ్యక్షుడు బొలిపల్లి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో వర్గల్ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో మోదీ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రపంచ దేశాలు భారత్ వైపు చూసేలా చేసిన గొప్ప మహనీయుడు మోదీ అని తెలియజేశారు. అనంతరం తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఆటో స్టాండ్ వద్ద జాతీయ జెండా ఎగురవేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, అంగన్వాడి కేంద్రంలో పండ్ల పంపిణీ చేశారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా పలువురి విశ్వకర్మలకు సన్మానం చేసి మిఠాయి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు , భాజపా అభిమానులు పాల్గొన్నారు.










### పుట్ట మధు ఇంటిని ముట్టడి చేసిన వారిపై

# చర్యలు తీసుకోవాలి

- ముందు మేనిఫెస్టో లో ఇచ్చిన హామీలను అమలు చేయండి
- ముత్తారంలో బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా

**ముత్తారం/ పెద్దపల్లి, (ప్రజా స్వరం) :**
మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఇంటిని ముట్టడి చేసిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని ముత్తారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహనీయుల ఆశయాల కొరకే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ క్రిస్టియన్ బడుగు బలహీనమైన సంబంధం మేల్కొల్పడం కొరకే నిరంతరం కృషి చేస్తున్న పుట్ట దంపతుల ఇంటిని ముట్టడించి అసత్య ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ గుండాలను వెంటనే అరెస్టు చేయాలని ఇలాంటి సంఘటనలు మరొక్కసారి జరుగుతే పుట్ట సైనికులం మీ నాయకుని ఇల్లు కూడా ముట్టడిస్తామని హెచ్చరించారు.మేనిఫెస్టో కమిటీ చైర్మన్ గా ఉండి హామీలు చేయడంలో విఫలమై ప్రజలను తప్పుదోవ పట్టించడం కొరకు మంత్రి శ్రీధర్ బాబు ఇలాంటి సంఘటనలు చేపిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.మీరు సొంతంగా విగ్రహాలను పెట్టుకొని ఆవిష్కరించుకోవాలె కానీ ఇతరులు పెట్టిన విగ్రహాలను రాత్రికి రాత్రే ఆవిష్కరణ చేయడం సిగ్గుచేటని అన్నారు.ఆరు గ్యారంటీలు 420 హామీలను ఎక్కడ ప్రజలు అడుగుతారో అన్న భయముతో మంథని నియోజకవర్గ ప్రజలను డైవర్ట్ చేసి ఇలా తప్పుదోవ పట్టిస్తున్న మంత్రి గారికి అతి కొద్ది రోజుల లోనే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. అనంతరం పోలీసులు కలుగజేసుకొని ఆందోళనను విరమింపజేశారు.ఈ కార్యక్రమంలో ముత్తారం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి,మాజీ ఎంపీపీ లు అత్తే చంద్రమౌళి,జక్కుల ముత్తయ్య,మాజీ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి,ముత్తారం మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు నూనె కుమార్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వీర వనితల తెగువ మనకు స్ఫూర్తి కావాలి

**తాండూరు, సెప్టెంబర్ 17(ప్రజా స్వరం):**
తాండూర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే. శ్రీనివాస్ యు బుగ్గప్ప మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాటంలో వీర వనితల తెగువ మనకు స్ఫూర్తి కావాలి అని అన్నారు.

**తెలంగాణ సాయుధ పోరాటం**

రైతులు లిఖించుకున్న చరిత్ర. భూమికై.. భుక్తికై... వెట్టి చాకిరి విముక్తికై... కమ్యూనిస్టులు చేసిన త్యాగాలకు నిలువెత్తు నిదర్శనం అని అన్నారు. దోపిడీపై సాగించిన ప్రజాయుద్ధం. ఆ యుద్ధక్షేత్రంలో 'ఆకాశంలోని సగమూ' పాల్గొంది. తమవంతు పాత్ర మహిళాలోకం పోషించింది అని గుర్తు చేశారు. సామాజికంగా అణగారిన స్త్రీలలో దాగున్న పోరాట పటిమకు ఈ పోరాటం ఓ తార్కాణం. 'బాంచన్ దొర నీ కాల్మొక్తా' అన్న నోటితోనే 'నీ గోరి కడతా కొడకా' అంటూ సివంగుల్లా విరుచుకుపడి ఎర్రజెండా చేతబూని పోరుబాటలో కదం తొక్కారు అని అన్నారు. సంప్రదాయ సంకెళ్లను తెంచుకుని శత్రువులను తరిమికొట్టారు. కాకులు దూరని కారడవిలో, చీమలు దూరని చిట్టడివిలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ పురుషులకు ధీటుగా నిలబడ్డారు. ఆ భీకరపోరులో తుపాకి పట్టి కిరాతక సైన్యంపై పోరాడిన వీరవనితలు కొందరైతే... పరోక్షంగా అండగా నిలబడ్డ ధీరలు కోకొల్లలు.
'తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకు నేందుకు ఆ కిరాతక సైనికుల దౌర్జన్యంపై స్త్రీలు చూపిన దీక్ష ప్రతిఘటన, పోరాట పటిమ మనలను ఉత్తేజపరుస్తాయి. అవన్నీ తలచుకుంటే ఆర్థికంగా, సామాజికంగా అణగారిన మన స్త్రీ జాతిలో ఎంతటి విప్లవదీక్ష, శక్తి ఇమిడి ఉన్నాయోనని ఆశ్చర్యానం దాలు కలుగుతాయి అని అన్నారు. ఆనాడు నైజాం ముష్కరులు, రజాకార్లు, నెహ్రూ సైన్యం జరిపిన అమానుష చిత్రహింసలకు




ఎక్కువగా బలైంది స్త్రీలే. కమ్యూనిస్టుల జాడ చెప్పమంటూ చింతబరిగెలతో ఒళ్లు చిట్లిపోయేలా కొట్టారు. చెప్పుకోలేని మాటలతో అవమానించారు. వారి కండ్ల ఎదుటే కన్న పిల్లలను, భర్తలను, అన్నదమ్ములను చిత్ర హింసలు పెట్టారు. లైంగికంగా హింసించారు. అన్నింటినీ పంటి బిగువన భరిస్తూ లక్ష్యం కోసం నిలబడ్డారు. అదురూ బెదురూ లేక చేతికి చిక్కిన వాటినే ఆయుధాలుగా చేసుకున్నారు. అన్యాయంపై తిరగబడ్డారు. తమ కోసం త్యాగాలు చేస్తున్న కమ్యూనిస్టులను కడుపులో పెట్టి కాపాడుకున్నారు. అంతటి గొప్ప చరిత్ర ఆ ధీర వనితలది అని తెలిపారు.

**వినూత్న చైతన్యంతో...**

శత్రువుల దుర్మార్గాల నుండి తప్పించుకునేందుకో, దళాల్లో చేరేందుకో, రహస్య జీవితం గడిపేందుకో ఇండ్లను వదిలి తమ మగవారు వెళ్లిపోతే అన్నింటినీ కాపాడుకునే బాధ్యత ఆనాడు స్త్రీలపైనే పడింది. అంతే కాదు అడవుల్లో నుంచి, చిన్న చిన్న గూడేల నుంచి కోయ, చెంచు మొదలైన వారందరినీ తరిమివేసే 'బ్రిగ్స్'పథకానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పురుషులతో సమానంగా పాల్గొన్నారు. నాటివరకు చూపని వినూత్న చైతన్యంతో, సరికొత్త మార్పుతో ఉద్యమబాట పట్టారు అని అన్నారు.

**దళ కమాండర్లుగా...**

నైజాం, రజాకారులకు వ్యతిరేకంగా జరిగిన ఈ సుదీర్ఘపోరాటంలో మహిళలు సైతం దళాల్లో చేరారు. ఎంతటి కష్టమొచ్చినా వెన్ను చూపక కొరియర్లుగా, రాజకీయ ఆందోళనకారులుగా బాధ్యతలు నిర్వర్తించారు. రహస్య జీవితాన్ని అనుభవించారు. అలాంటి వారిలో మనకు బాగా సుపరిచితమైన వారు మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవితో పాటు మరెందరో అని అన్నారు.నవాబుల కాలం చెల్లింది. రజాకార్లు కనుమరు గయ్యారు. బ్రిటీషోళ్లు పారిపోయారు. కానీ మహిళలపై హింస, దోపిడీ కొనసాగుతూనే ఉంది. ఇక సమానత్వం, సాధికారత కంటికి కానరానంత దూరంలో ఉంది అని అన్నారు. మొన్నటికి మొన్న కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై జరిగిన అమానుష ఘటన దీనికి తాజా ఉదాహరణ. మహిళల భద్రత నేడు కూడా సవాలుగా మారింది అని తెలిపారు. చోద్యం చూస్తున్న ప్రభుత్వాలను నిలదీయాల్సిన సమయమిది. రైతాంగ పోరాటంలో ఆ వీర వనితల తెగువ మనకు స్ఫూర్తి కావాలి. హింసకు వ్యతిరేకంగా పోరాడే చైతన్యం పొందాలి. అదే వారి త్యాగాలకు మనమిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. సిపిఎం సిఐటియు ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ కెవిపిఎస్ వ్యవసాయ కార్మిక సంఘం తెలంగాణ మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ వాహబ్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఉప్పల్ మల్కయ్య, తెలంగాణ మైనార్టీ హక్కుల పోరాట సమితి తాండూర్ ఇంచార్జి సాధిక్ సమీయుద్దీన్, సిఐటియు తాండూర్ మున్సిపల్ వర్కర్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్, శ్రీను, వెంకటయ్య సిపిఎం నాయకులు జైపాల్ కృష్ణ, బాలస్వామి, వెంకటేష్ ,బస్వారాజు, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు



**తూప్రాన్, (ప్రజాస్వరం) :** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జన్మదిన పురస్కరించుకొని కాళ్లకల్ బంగారమ్మ దేవాలయం లో ప్రతేక పూజలు నిర్వహించడం జరిగింది. అనంతరం పేదలకు పండ్లు పంపిణి చేసి గజ్వేల్ నియోజకవర్గం లో నరేంద్ర మోడీ గారి జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి మనోహరాబాద్ నుండి భారీ గా తరలి వెళ్లడం జరిగింది . ఈ కార్యక్రమంలో సేవ పక్వాడ జిల్లా కన్వీనర్ నత్తి మల్లేష్ ముదిరాజ్ గారు మనోహరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు బక్క వెంకటేష్ గౌడ్,జిల్లా నాయకులు, పురం మహేష్ ముదిరాజ్, మాజీ మండల అధ్యక్షులు కమ్మరి నరేందర్ చారి,భాషబోయిన చంద్రశేఖర్ ముదిరాజ్, మండల పక్వాడ కన్వినర్ కొల్తూరి నరేష్ గౌడ్, కో కన్వినర్ కుంట మహేష్ ముదిరాజ్, ప్రభాకర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి కరట మల్లేష్ ముదిరాజ్,మండల ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, సాదు సత్యనారాయణ, చాకలి మల్లేష్, మండల నాయకులు కొత్తూరు మల్లేష్, నర్సింలు ముదిరాజ్,ఎర్ర కృష్ణ, కుమ్మరి నాగరాజు, ఎల్ శేఖర్ గౌడ్, మల్లేష్ యాదవ్, ఊట్ల నాగరాజు, మామిండ్ల ప్రణయ్, చాపల విజయ్, కళ్లెం యాదగిరి, నారం రాజు, నాగేందర్, ఐటీ కన్వినర్ మంచి గిరీష్ వెంకటేష్ చారి,సాదు వెంకటేష్, బూత్ కమిటీ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ ప్రజా పాలన

# దినోత్సవ వేడుకలు

### ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ



**శామీర్ పేట, సెప్టెంబర్ 17 (ప్రజాస్వరం) :** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కమిషనర్ జ్యోతి జిల్లా ఆర్టిఏ సభ్యుడు జైపాల్ రెడ్డితో కలిసి జాతీయ జెండా ఎగరవేశారు. అనంతరం స్వచ్ఛభారత్ పోస్టర్ ను ఆవిష్కరించారు. శామీర్ పేట మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇంచార్జ్ ఎంపీడీవో సంపత్ కుమార్ జాతీయ జెండా ఆవిష్కరించి ప్రజాపాలన దినోత్సవం జరుపుకున్నారు. శామీర్ పేట తహసిల్దార్ కార్యాలయం వద్ద తాహసిల్దార్ యాదగిరి రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. మూడు చింతలపల్లి తాహాసిల్దార్ కార్యాలయం వద్ద తాహాసిల్దార్ వెంకటనరసింహారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. శామీర్ పేట విద్యుత్ సబ్ స్టేషన్లో ఏఈ రాఘవేందర్ రావు, అలియాబాద్ విద్యుత్ సబ్ స్టేషన్లో ఏఈ వెంకటనారాయణలు జాతీయ జెండాలను ఎగురవేశారు. ఉమ్మడి శామీర్ పేట మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఎగురవేసి ప్రజాపాలన దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు.





# విరాట్ విశ్వకర్మ జెండా ఆవిష్కరణ

**ముత్తారం/పెద్దపల్లి,సెప్టెంబర్17(ప్రజా స్వరం) :** ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శ్రీ విరాట్ విశ్వకర్మ జెండా ఆవిష్కరణ మరియు అభిషేకం హోమ మహోత్చవం నిర్వహించారు.గుడి నిర్మించి ఐదు సంవత్సరాలు అవుతుందని నిత్య దూపదీపా నైవేద్య కార్యక్రమమాలు చేస్తున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఆకోజు రమేష్ శారద లతో పాటు మారుపాక కర్ణాకర్ మమత భక్తులు పాల్గొన్నారు.

# గోదావరి నదిలో యువకుడు పడి చనిపోవడం బాధాకరం

- **పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**
- **వినాయక నిమజ్జనంలో మృతి చెందిన యువకుని కుటుంబ సభ్యులకు పరామర్శ**



**గోదావరిఖని/ పెద్దపల్లి, సెప్టెంబర్17 (ప్రజా స్వరం) :** రామగుండంలో జరిగిన వినాయక నిమజ్జనం సందర్భంగా దురదృష్టవశాత్తు గోదావరి నదిలో పడి ప్రాణాలు కోల్పోయిన రాజేష్ కుటుంబాన్ని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ పరామర్శించారు.ఈ సందర్భంగా ఎంపి వంశీకృష్ణ రాజేష్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి,వారి బాధలో తాను కూడా భాగమని తెలియజేశారు.మరణం ఎవరికీ పూడ్చలేని లోటు అయినా ప్రభుత్వ సహాయం కోసం తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అలాగే ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా నిమజ్జనాల సమయంలో రక్షణ చర్యలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అధికారులను కోరారు.తన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999